RNI NO .TGTEL/25/A4366




అంతులేని శ్రమ దోపిడీకి గురవుతున్న తెలంగాణ కార్మిక వర్గం


# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో పని చేయుటకు నియోజకవర్గాలవారీగా విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387


PUBLISHED: TELANGANA    సంపుటి : 01    సంచిక :13    గురువారం 18 డిసెంబర్ 2025    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 08    వెల :05/-

## బుర్కా మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ.. కూబింగ్ ఆపరేషన్‌లో 16 మంది మావోయిస్టులు అరెస్టు




## 'న్యాయమే గెలిచింది'.. నేషనల్ హెరాల్డ్ కేసుపై ఖర్గే కీలక వ్యాఖ్యలు




## 500 మంది మహిళలకు.. అండగా నిలిచిన సోనూసూద్




## మావోయిస్టుల అరెస్టును ఖండించిన తెలంగాణ రాష్ట్ర కమిటీ




## ముగిసిన మూడో దశ పంచాయతీ పోలింగ్..




## బీహార్ సీఎం ఆమెను ఇంకెక్కడో తాకి ఉంటే?.. యూపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు




## తిరుపతిలో ఆరేళ్ల బాలికకు స్క్రబ్ టైఫస్




## ఇకపై ఏది ఫ్రీ కాదు.. ప్రపంచ వాణిజ్యంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా కీలక వ్యాఖ్యలు




ఇండియా ఎకనామిక్ కాన్‌క్లేవ్ 2025లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం గ్లోబల్ ట్రేడ్ ఫెయిర్ గానీ, ఫ్రీ గానీ లేదు.. టారిఫ్‌లు, నాన్-టారిఫ్ అడ్డంకులు ఆర్థిక సాధనాలుగా కాకుండా వ్యూహాత్మక ఆయుధాలుగా మారిపోయాయి అని పేర్కొనింది. అయితే, భారత్ ఎప్పుడూ టారిఫ్‌లను ఆయుధాలుగా ఉపయోగించలేదు.. దేశీయ పరిశ్రమలు, ఉపాధిని కాపాడటమే మా లక్ష్యం అని నిర్మలా సీతారామన్ స్పష్టం చేసింది.

అయితే, మారుతున్న ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో భారత్ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత వాణిజ్య ఆంక్షలు మరింత తీవ్రతరం కావడంతో భారత ఎగుమతులపై భారీ సుంకాలు విధించాడు. అలాగే, రష్యా నుంచి చమురు దిగుమతిని సాకుగా చూపించి భారత వస్తువులపై అమెరికా 50 శాతం వరకు టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఈ తాజా పరిస్థితిపై

## చెప్పిన చోట ఆగలేదని బస్సు అద్దాలు ధ్వంసం




ఏపీఎస్ ఆర్టీసికి చెందిన బస్సు ధర్మవరం నుంచి తాడిపత్రి వైపు ప్రయాణిస్తోంది. ఓ గ్రామం వద్ద ఓ కుర్రోడు బస్సు కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో ఆ బస్సు ఆ ఊరి మీదుగా ప్రయాణిస్తోంది. బస్సును చూసిన ఆ కుర్రోడు బస్సు ఆపాలని సైగ చేశాడు. అయితే అక్కడ బస్ స్టాప్ లేకపోవడంతో బస్సును డ్రైవరు ఆపలేదు. దీంతో ఆగ్రహానికి గురైన కుర్రోడు చేతిలో రాయిని పట్టుకొని బస్సు వైపు వేగంగా విసిరాడు. దీంతో బస్సు ముందు భాగంలోని అద్దం కొంత డ్యామేజ్ అయ్యింది.

ఆకస్మికంగా జరిగిన రాళ్ల దాడితో ఉలికిపడిన బస్సు డ్రైవరు బస్సును నిలిపివేశాడు. అది గమనించిన ఆ కుర్రోడు అంతటితో ఆగకుండా బస్సు ఎక్కి డ్రైవరుతో వాదులాటకు దిగాడు. తాను ఆపమంటే బస్సు ఆపరా అంటూ గొడవపడ్డాడు. బస్టాండ్ అక్కడే ఉందని బుకాయించాడు. అసలు బస్సు అద్దం ఎందుకు పగలగొట్టావంటే దురుసుగా సమాధానం ఇచ్చాడు.

ఇదెక్కడి చోద్యం.. తాను ఆపమంటే బస్సు ఆపలేదని బస్సు అద్దం పగలగొట్టాడు ఓ కుర్రోడు. అద్దం పగలకొట్టడమే కాకుండా పై నుంచి డ్రైవరు, కండక్టర్లను దబాయించాడు. వారితో వాగ్వాదానికి దిగి ఏం చేసుకుంటారో చేసుకోండని చక్కా పోయాడు. ఈ సందర్భంగా ధర్మవరం నుంచి తాడిపత్రి వెళ్లే మార్గంలో జరిగింది. అందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వీడియోలోని వివరాల ప్రకారం

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ సంచలన తీర్పు

- ఐదుగురు ఎమ్మెల్యేలపై ఫిరాయింపు ఆరోపణలు కొట్టివేత
- ఆధారాలు లేవంటూ స్పీకర్ స్పష్టం
- బీఆర్ఎస్ వాదనలను తిరస్కరించిన సభాధ్యక్షుడు
- సుప్రీంకోర్టు గడువు నేపథ్యంలో వెలువడిన తీర్పు
- 2023 ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలు
- ఫిరాయింపు నిరోధక చట్టంపై స్పీకర్ వివరణ
- మిగతా ఐదుగురు ఎమ్మెల్యేల పిటిషన్లపై విచారణ కొనసాగింపు
- నిర్ణయానికి సమయం కోరిన కడియం, దానం నాగేందర్

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపుల ఆరోపణలను స్పీకర్ తోసిపుచ్చారు. వారు పార్టీ ఫిరాయించినట్టు ఎక్కడా ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులు ఫిరాయింపులకు పాల్పడలేదని తేల్చిచెప్పారు.

మిగతా 2 లో



## ఎన్నికల ఖర్చు భరించలేక సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్యాయత్నం




కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల బరిలో నిలబడిన ఒక సామాన్య అభ్యర్థి, ప్రత్యర్థుల ధనబలంతో పోటీ పడలేక బలవన్మరణానికి యత్నించిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. కాగజ్‌నగర్ మండలం పెదరాస్పల్లి గ్రామంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ?పెదరాస్పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ తరపున, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మద్దతుతో బొమ్మెర రాజన్న పోటీ చేస్తున్నారు.

## గుడివాడలో నాగార్జున పర్యటన..ఆ కాలేజీకి భారీ ఆర్థిక సాయం !




గుడివాడ పర్యటనలో ఉన్న అక్కినేని నాగార్జున కీలక ప్రకటన చేశారు. గుడివాడ ఏఎన్ఆర్ కాలేజీకి రూ.2 కోట్ల విరాళం ఇస్తున్నట్లు వెల్లడించారు అక్కినేని నాగార్జున. కృష్ణాజిల్లా గుడివాడలో ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ కార్యక్రమం జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా అక్కినేని నాగార్జున హాజరయ్యారు.

# సర్పంచ్ ఎన్నికలు ముగియగానే భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..?

సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ ముగియగానే పెద్ద ఎత్తున ఐఏఎస్ అధికారులను బదిలీ చేసేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. దీని కోసం సీఎంవో అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. ప్రధానంగా రెండేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఆఫీసర్లను తగ్గించడంతోపాటు ఇన్ చార్జి ఆఫీసర్లు ఉన్న చోట పూర్తి స్థాయి అధికారులను నియమించాలని సీఎం భావిస్తున్నారు. అందులో భాగంగా ఏ ఆఫీసరును ఎక్కడ నియమించాలనే అంశంపై వడపోతలు జరుగుతున్నట్లు తెలిసింది.

**పర్ఫార్మెన్స్ రిపోర్ట్ రెడీ!**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబరు 7 తో రెండేళ్లు పూర్తయింది. ఈ కాలంలో ఐఏఎస్ అధికారుల పనితీరుపై సీఎంవో అధికారులు పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించారు. మంత్రులతో సమన్వయం, ఫైళ్ళ క్లియరెన్స్, శాఖల్లోని సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో చొరవ.. ఇలా పలు కోణాల్లో ఆఫీసర్ల పనితీరును ఆరా తీశారు. మెజారిటీ అధికారుల పర్ఫార్మెన్స్ సరిగా లేదని నిఘా వర్గాలు తమ నివేదికలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే కొందరు అధికారులు సీఎం ఆదేశాలను సైతం బేఖాతరు చేసిన సందర్భాలు ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. అలాంటి ఆఫీసర్లను అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయొచ్చని సెక్రటేరియట్ వర్గాల్లో ఉన్న టాక్. అలాగే పలు కమిషనర్లు, కలెక్టర్ల పనితీరుపై నివేదికలు తీసుకుని, సరిగా




పనిచేయని అధికారులను బదిలీ చేయడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తున్నది.

**మంత్రులనూ పట్టించుకోని ఐఏఎస్ లు**

కొందరు ఐఏఎస్ అధికారులు మంత్రుల ఆదేశాలను సీరియస్ గా తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మంత్రి చెప్పినప్పుడు సరేనంటూ తలూపి, ఆ తరువాత తమకు తోచిన విధంగా పని చేస్తున్న ఆఫీసర్లు ఉన్నారు.

## నూతన సర్పంచుల బాధ్యతల స్వీకరణ వాయిదా.. ఎందుకంటే..?




తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. నేడు మూడో విడత ఎన్నికలు జరుగుతుండగా రాత్రి వరకు ఓట్ల లెక్కింపు ముగిసి.. ఎన్నికలు ముగియనున్నాయి. దీంతో ఈ నెల 20న గెలిచిన సర్పంచ్ ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేయడానికి అధికారులు నిర్ణయించారు. కానీ ఎవరూ ఊహించని విధంగా నూతన సర్పంచుల బాధ్యతల స్వీకరణ వాయిదా వేశారు. తాజా నిర్ణయం ప్రకారం..

## బీహార్ సీఎం ఆమెను ఇంకెక్కడో తాకి ఉంటే?.. యూపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధికారిక కార్యక్రమంలో ఓ ముస్లిం మహిళ హిజాబ్‌ను తొలగించిన ఘటనను సమర్థిస్తూ ఉత్తరప్రదేశ్ మత్స్య శాఖ మంత్రి సంజయ్ నిషాద్ స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. హిజాబ్‌ను తాకడానికే ఇంత హడావుడి అవసరమా? మరెక్కడైనా తాకితే ఏమయ్యేది? అంటూ చేసిన కామెంట్స్ తీవ్ర అభ్యంతరానికి కారణమవుతున్నాయి. మంత్రి వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని పలువురు రాజకీయ నేతలు, మహిళా సంఘాలు విమర్శించాయి.

ఇక, మహిళల గౌరవం, మతపరమైన భావాలు దెబ్బతినేలా వ్యవహరించడం తగదని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. నితీశ్ కుమార్ చర్యలపై వివరణ ఇవ్వాలని, సంజయ్ నిషాద్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, ముస్లింలు, దళితుల పట్ల బీజేపీ నేతల ఆలోచన ఎలా ఉందో ఈ సంఘటనను బట్టి అర్థం చేసుకోవచ్చు అని పేర్కొన్నారు.

అయితే, ఈ అంశంపై చెలరేగిన విమర్శలపై స్పందించిన మంత్రి సంజయ్ నిషాద్.. తన వ్యాఖ్యలను వక్రీకరించారని వివరణ ఇచ్చారు. నితీశ్ కుమార్ నియామక పత్రం సరైన వ్యక్తికే అందుతుందా లేదా అన్నది నిర్ధారించుకోవడానికే హిజాబ్‌ను తాకారని, ఇందులో ఎలాంటి తప్పుడు ఉద్దేశం లేదన్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని కోరారు. ఇక, నియామక పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమంలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పాల్గొన్నారు. ఆ సమయంలో ఒక మహిళా ఆయుష్ వైద్యురాలికి నియామక పత్రం అందజేస్తూ, ఆమె ముఖాన్ని చూసేందుకు హిజాబ్‌ను తొలగించడం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఈ ఘటన జరిగిన సమయంలో ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, నితీశ్‌ను ఆపేందుకు ప్రయత్నించడం స్పష్టంగా కనిపిస్తుంది.

## తిరుపతిలో ఆరేళ్ల బాలికకు స్క్రబ్ టైఫస్

తిరుపతి చంద్రగిరి(మం) తొండవాడలో ఆరేళ్ల బాలికకు స్క్రబ్ టైఫస్ సోకింది. బాలిక కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుంది. చంద్రగిరి సీహెచ్‌సీ, అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. రక్తపరీక్షల్లో స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారులు వెల్లడించారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు, వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు.

స్క్రబ్ టైఫస్ అంటే ఏంటి?

స్క్రబ్ టైఫస్‌ను బుష్ టైఫస్ అని కూడా అంటారు. ఓరియెంటియా త్సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల స్క్రబ్ టైఫస్ వస్తుంది. ముందుగా ఇది ఎలుకలకు సోకుతుంది. వాటిని కుట్టిన నల్లిపైకి ఆ సూక్ష్మజీవులు చేరతాయి. నల్లి మనల్ని కుట్టినప్పుడు స్క్రబ్ టైఫస్ మనుషులను సోకుతుంది. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉండగలదు. అధికంగా రాత్రి సమయాల్లో ఈ పురుగులు మనుషులను కుడుతుంటాయి. కుట్టినచోట మచ్చలతోపాటు దద్దుర్లు ఉంటాయి. దీనిపై ప్రజల్లో అంతగా అవగాహన లేదు. తమిళనాడులో మారుతున్న వాతావరణ పరిస్థితులు స్క్రబ్ టైఫస్ వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి.

స్క్రబ్ టైఫస్‌ని ఎలా గుర్తించాలి?

చర్మంపై కాలిన మచ్చలు, జ్వరం వంటి ప్రాథమిక లక్షణాలు గుర్తించిన వెంటనే అప్రమత్తమవ్వాలి. వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. 'ఎలిసా' అనే రక్తపరీక్ష ద్వారా దీన్ని గుర్తించొచ్చు. పీసీఆర్ వంటి మాలిక్యులార్ టెస్ట్ ద్వారా కూడా శరీరంలో బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించేందుకు అవకాశం ఉంటుంది.


## టీటీడీకి తీరని ద్రోహం జరుగుతోంది మాజీ ఛైర్మన్ సంచలన ఆరోపణలు

టీటీడీకి తీరని ద్రోహం చంద్రబాబు చేస్తున్నారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మూడు వెల కోట్ల భూమిని ఒబెరాయ్ హొటల్‌కు ఇచ్చి వేంకటేశ్వర స్వామికే నామాలు పెట్టారని చెప్పారు. పరకామణి దొంగతనం కంటే వందరెట్లు పెద్ద దొంగతనం ఇదన్నారు.. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. వంద రూముల హొటల్ కోసం మూడు వేలకోట్ల విలువైన స్వామి వారి భూములు ఇస్తారా..? అని ప్రశ్నించారు. అలిపిరి రోడ్డులో టూరిజం భూమి తీసుకుని దానిని బదులుగా టీటీడీ భూమి ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఓబరాయ్ హొటల్ కోసం అత్యంత విలువైన భూమిని బదిలీ చేశారు. హొటల్ కు ఆ స్థలం ఇవ్వడమే కాకుండా లీజు కూడా మాఫీ చేశారు. మూడువేల కోట్లు విలువైన భూమిని చంద్రబాబు దోచిపెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు.

రిజిస్ట్రేషన్ చేసినా భూమి ఈసీలో ఇది కనపడటం లేదు.. ఎందుకు దాచారు.. ఎవరి కోసం దాచిపెట్టారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నిలదీశారు. "జీవో ఇవ్వకుండానే.. రిజిస్ట్రేషన్ కాకుండా అక్కడ ఉండే భూమిలోని ఎర్రచందనం చెట్లు మాయం చేశారు. అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా కలెక్టర్ అదేశాలతో ఇవన్నీ జరిగాయి. టీటీడీ భూమి ఎలా ఒబెరాయ్ హొటల్‌కు ఇస్తారు. స్వాములు, పీఠాధిపతులు అందరూ దీన్ని వ్యతిరేకించాలి. దీని వెనుక కోట్లా రూపాయల అవినీతి దాగి ఉంది. పవన్ కల్యాణ్ ఎందుకు దీన్ని అడ్డుకోలేదు.. పవన్, చంద్రబాబు కలసి ప్రైవేటు సంస్థకు ఇచ్చేశారు." అని వెల్లడించారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ సంచలన తీర్పు

మొదటి పేజీ తరువాయి



బీఆర్ఎస్ వాదనలతో ఏకీభవించని స్పీకర్.. ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి నిరాకరించారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్య విషయంలో నాలుగు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గడువు విధించిన నేపథ్యంలో స్పీకర్ తీర్పు వెలువరించారు.


2023 తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి విజయం సాధించిన 10 మంది ఎమ్మెల్యేలు.. తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఈ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌ను కోరుతూ బీఆర్ఎస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఇంకో పార్టీలో చేరితే అనర్హులుగా ప్రకటించాలి. కానీ, అధికారికంగా మారడం లేదా విప్ ధిక్కరించాల్సి ఉంటుంది. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని మర్యాదపూర్వకంగా సీఎంను కలిశామని స్పీకర్ వద్ద వివరణ ఇచ్చారు.

మిగతా ఐదుగురు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌ల అనర్హత పిటిషన్లపై విచారణ జరిగింది. వీరిలో కడియం, దానం నాగేందర్‌లు తమ నిర్ణయం చెప్పడానికి స్పీకర్‌ను కొంత సమయం కోరారు. పోచారం, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌లపై పిటిషన్ల విచారణ పూర్తి కావడంతో త్వరలోనే స్పీకర్ నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

తాము స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన అనర్హతపై నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం... 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని జులై 2025న ఆదేశించింది. అక్టోబర్ 31తో మూడు నెలల గడువు పూర్తికావడంతో 'గ్రాస్ కంటెంప్ట్' అంటూ సుప్రీంకోర్టు హెచ్చరించింది. నాలుగు వారాల్లో అంటే డిసెంబర్ 18లోపు నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు స్పష్టం చేసింది. ఈ క్రమంలో స్పీకర్ విచారణ ముగించి, ఐదుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి తొలి దశలో తీర్పు ఇచ్చారు.

## సర్పంచ్ ఎన్నికలు ముగియగానే భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..?

మొదటి పేజీ తరువాయి



రెండు చోట్ల బాధ్యతలు చూస్తున్న సెక్రెటరీలు/కమిషనర్లు

| పేరు | పూర్తి స్థాయి బాధ్యతలు | అదనపు బాధ్యతలు |
|---|---|---|
| సంజయ్ | ఇండస్ట్రీస్ సెక్రెటరీ | ఐటీ |
| రఘునందన్ | కమర్షియల్ ట్యాక్స్, ఎక్సయిజ్ సెక్రెటరీ | కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ |
| బుద్ధ ప్రసాద్ | ప్లానింగ్ సెక్రెటరీ | సోషల్ వెల్ఫేర్ |
| ఈ. శ్రీధర్ | బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ | జీఏడీ సెక్రెటరీ |
| దాన కిషోర్ | లేబర్ సెక్రెటరీ | గవర్నర్ సెక్రెటరీ |
| ఇలంబర్తి | ట్రాన్స్ పోర్ట్ సెక్రెటరీ | పశుసంవర్ధకశాఖ సెక్రెటరీ |
| ఎన్. శ్రీధర్ | పంచాయతీ రాజ్ సెక్రెటరీ | మైనింగ్ సెక్రెటరీ |
| అనితా రామచంద్రన్ | స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ | గిరిజన సంక్షేమ శాఖ సెక్రెటరీ |
| సురేంద్ర మోహన్ | అగ్రికల్చర్ సెక్రెటరీ | కో ఆపరేటివ్ కమిషనర్ |
| గోపి | వ్యవసాయశాఖ కమిషనర్ | పశు సంవర్ధక శాఖ కమిషనర్ |
| కృష్ణ ఆదిత్య | ఇంటర్ బోర్డు కమిషనర్ | ఎస్సీ గురుకులాల సెక్రెటరీ |

ఈ విషయాన్ని గుర్తించిన కొందరు మంత్రులు ఏకంగా సీఎంకు ఫిర్యాదులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుత బదిలీల్లో మంత్రులతో సఖ్యత లేని అధికారులను అక్కడి నుంచి తప్పించే చాన్స్ ఉందని తెలుస్తోంది.

ఆ రెండు పోస్టుల కోసం పైరవీలు

కొందరు ఐఏఎస్ లు తమకు ప్రాధాన్య శాఖలు ఇవ్వాలని కొంత కాలంగా పైరవీలు చేస్తున్నారు. అందుకోసం ఏకంగా ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల ద్వారా లాబీయింగ్ చేస్తున్నారు. అందులో ప్రధానంగా మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సింగరేణి సీఎండీ పోస్టులు ఉన్నట్లు తెలిసింది. ఈ రెండు పదవుల కోసం ఉత్తరాది ఐఏఎస్ లు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు అధికారులు ఢిల్లీకి వెళ్లి 'పెద్ద స్థాయిలో' ఆశీస్సులు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అక్కడ కనీసం ఏడాది పాటు ఉద్యోగం చేస్తే చాలు అనే ధోరణిలో అధికారులు ఉన్నట్లు టాక్ ఉంది.

కలెక్షన్లలో పలువురు కలెక్టర్లు..

పలు జిల్లాల కలెక్టర్ల పనితీరుపై ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిసింది. వారి వద్దకు వచ్చే భూ వివాదాలను పరిష్కరించేందుకు ఇరు పక్షాల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొందరు కలెక్టర్లు తమ సన్నిహితుల ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర పెట్టుబడులు పెడుతున్నట్టు విమర్శలు ఉన్నాయి. చిన్న జిల్లాలు ఉండటంతో ఐదారేండ్ల సర్వీసు పూర్తి చేసుకోగానే ఐఏఎస్‌లకు కలెక్టర్‌గా పనిచేసే అవకాశం వస్తున్నది. ఆదర్శంగా ఉండాల్సిన కలెక్టర్లు అవినీతి పాల్పడటంపై సీఎం సీరియస్‌గా ఉన్నట్టు టాక్. ఫిర్యాదులు ఉన్న అధికారులను ప్రస్తుత ఉన్న చోట నుంచి తప్పించాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.

## ఎన్నికల ఖర్చు భరించలేక సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్యాయత్నం

మొదటి పేజీ తరువాయి

అయితే, క్షేత్రస్థాయిలో ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు భారీగా డబ్బులు పంచుతుండటంతో రాజన్న తీవ్ర మనోవేదనకు గురయ్యారు.

తన వద్ద పంచడానికి డబ్బులు లేకపోవడంతో, ఎన్నికల్లో ఓడిపోతాననే భయంతో బుధవారం ఉదయం ఆయన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ?గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కాగజ్‌నగర్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. రాజన్న ఆరోగ్య పరిస్థితి పై డాక్టర్లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రాజన్న పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన వైద్యం కోసం ఆయనను కరీంనగర్ ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధనబలం ముందు ప్రజాస్వామ్యం వెలవెలబోతోందని, ఒక నిజాయితీ గల అభ్యర్థి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పట్ల స్థానికంగా చర్చ జరుగుతోంది.

## గుడివాడలో నాగార్జున పర్యటన..ఆ కాలేజీకి భారీ ఆర్థిక సాయం !

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఏఎన్ఆర్ కళాశాలలో రూసా భవనాన్ని నాగార్జున ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో అక్కినేని నాగార్జున మాట్లాడారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు, చదువు కోలేకపోయిన వేలాది పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు చాలా కృషి చేసినట్లు గుర్తు చేశారు.

1959 సంవత్సరంలో ఈ కళాశాలకు ఏఎన్ఆర్ లక్ష రూపాయలు విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల స్కాలర్షిప్ ల కోసం తమ అక్కినేని ఫ్యామిలీ నుంచి రూ.2 కోట్ల విరాళం అందిస్తున్నట్లు కూడా ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. మా నాన్న ఎప్పుడో లక్ష రూపాయలు ఇచ్చారు, ఇప్పుడు మేము ఇది కూడా ఇవ్వకపోతే బాగోదన్నారు. మనుషులు శాశ్వతం కాదని, మనం చేసే కార్యక్రమాలు శాశ్వతం అంటూ గుర్తు చేశారు అక్కినేని నాగార్జున. ఇక ఈ కార్యక్రమంలో యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, లోకల్ ఎమ్మెల్యే వెనిగండ్ల రామ్ పాల్గొన్నారు.

## నూతన సర్పంచుల బాధ్యతల స్వీకరణ వాయిదా.. ఎందుకంటే..?

మొదటి పేజీ తరువాయి

ఈ గడువును డిసెంబర్ 22వ తేదీకి మార్చారు. డిసెంబర్ 20న పదవీ బాధ్యతలు చేపట్టాల్సి ఉండగా.. సరైన ముహూర్తాలు లేవని, ఆ రోజు బాధ్యతలు స్వీకరించడం మంచిది కాదని భావించిన పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దీంతో నూతన సర్పంచుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న పంచాయతీ రాజ్ శాఖ, బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని రెండు రోజులు వెనక్కి జరిపి డిసెంబర్ 22న నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో అదే రోజున నూతన సర్పంచులు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, నూతన పాలకవర్గాలతో ప్రమాణస్వీకారం చేయించాలని ఉన్నతాధికారులు ఇప్పటికే జిల్లాల కలెక్టర్లకు, పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## బుర్కా లేకుండా బయటకు వెళ్లిందని భార్య, పిల్లల్ని చంపిన భర్త.. వారం తర్వాత బిగ్ ట్విస్ట్

భార్య భర్తల మధ్య చెలరేగిన గొడవ ముగ్గురు ప్రాణాలను బలి తీసుకుంది. భార్య చేసిన పని అవమాన భారంగా భావించిన ఓ భర్త తన భార్య, ఇద్దరు పిలల్ని నిర్దాక్షిణ్యంగా చంపేశాడు. వారం రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన ఈ దారుణ ఘటన యూపీలోని షామ్లి జిల్లాలో చోటు చేసుకుంది. ఫరూఖ్, తాహిరా (35) భార్య భర్తలు, వీరికి షరీన్ (14), అఫ్రీన్ (6) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే తాహిరాతో పాటు ఆమె ఇద్దరు కుమార్తెలు వారం రోజుల నుంచి కనిపించకుండా పోయారు. ఉన్నట్టుండి ముగ్గురి అదృశ్యం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ క్రమంలో నిన్న గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగిన పోలీసులు అనుమానంతో ఫరూఖ్?ను అదుపులోకి తీసుకుని విచారించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

అవమాన భారం: తనకు కొంత డబ్బు కావాలని తాహిరా తన భర్త ఫరూక్ ను అడిగింది. ఈ విషయంలో భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భర్తపై కోపంతో తాహిరా బురా? ధరించకుండానే బయటకు వెళ్లిపోయింది. అది అవమానంగా భావించిన భర్త ఆమెను చంపేసేందుకు ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో ఓ పిస్టల్ ను కొనుకుని వచ్చి తన భార్యను చంపేశాడు. అయితే అప్పుడే నిద్ర లేచిన తన ఇద్దరు కుమార్తెలను సైతం కోపంతో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో తన భార్య ఇద్దరు కుమార్తెలు ప్రాణాలు కోల్పోగా ఈ ముగ్గురి మరణం బయటకు తెలియకుండా ఇంట్లోనే గొయ్యి తీసి అక్కడే వారిని పాతిపెట్టాడు. ముగ్గురు కనిపించకపోవడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో ఫరూక్ నిజం ఒప్పుకున్నాడని, నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన పిస్టల్ ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. కాగా భార్య భర్తల మధ్య గొడవలో అమాయక పసిపిల్లలు బలికావడం స్థానికంగా మరింత విషాదాన్ని నింపింది.

## 'న్యాయమే గెలిచింది'.. నేషనల్ హెరాల్డ్ కేసుపై ఖర్గే కీలక వ్యాఖ్యలు

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఊరట లభించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే స్పందించారు. నేషనల్ హెరాల్డ్ కేసును రాజకీయ దురుద్దేశంతోనే వేశారని అన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ఇప్పటిది కాదని 1938లో దేశస్వాతంత్ర్యం కోసం పుట్టిందని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధులే ఈ పత్రికను ప్రారంభించారని అన్నారు. కానీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం సీబీఐ, ఈడీలలను వాడుకుని కాంగ్రెస్ నేతలపై వేధింపులకు గురి చేస్తోందన్నారు. గాంధీ కుటుంబాన్ని వేధించేందుకు ఈ కేసు పెట్టారని చెప్పారు.ఈ కేసులో ఏమీ లేదని ఎఫ్ఐఆర్ కూడా లేదన్నారు. ఎవరో ప్రైవేటు వ్యక్తులు ఫిర్యాదు చేస్తారని తరవాత విచారణ పేరుతో వేధిస్తారని చెప్పారు. కేసులో దమ్ము లేకపోయినా ఏదో ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈడీ, మనీలాండరింగ్ కేసులతో వేధించి కాంగ్రెస్ ఎంపీలను, రాజ్యసభ సభ్యులను బీజేపీ తమ పార్టీలో చేర్చుకుందన్నారు. కేసులో ఊరట లభించడంతో సత్యమే గెలిచిందని సత్యమేవజయతే అనేదే తమ నినాదం అన్నారు. న్యాయమే ఎప్పుడూ గెలుస్తుందని కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు.

## ఇకపై ఏది ఫ్రీ కాదు.. ప్రపంచ వాణిజ్యంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

టారిఫ్‌లు, ఇతర చర్యల ద్వారా వాణిజ్యాన్ని ఆయుధంగా మార్చుతున్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ చర్చలు, రాజనీతితో ముందుకెళ్తుందని చెప్పుకొచ్చింది. ఒకప్పుడు ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 25 శాతం భారత్ నుంచే వచ్చేది.. అలాంటి స్థాయికి మళ్లీ చేరుకోవడమే మన టార్గెట్ కావాలని అన్నారు. ప్రస్తుత సవాళ్ల మధ్య భారత్ గ్లోబల్ వాణిజ్యంలో తన స్థానాన్ని తిరిగి సంపాదించుకోవాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం.. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని నమోదు చేస్తుందన్నారు. బడ్జెట్ పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ విషయంలో కేంద్రం స్పష్టమైన లక్ష్యాలతో ముందుకెళ్తోందమని నిర్మలా సీతారామన్ వెల్లడించింది.

## 500 మంది మహిళలకు..అండగా నిలిచిన సోనూసూద్

వెండితెరపై విలన్‌గా అలరించిన సోనూసూద్, నిజ జీవితంలో మాత్రం కోట్లాది మందికి ఆపద్బాంధవుడిగా మారి రియల్ హీరో అనిపించుకుంటున్నారు. తాజాగా ఆయన తన 'సూద్ ఛారిటీ ఫౌండేషన్' ద్వారా ఒక గొప్ప కార్యాన్ని పూర్తి చేశారు. దేశవ్యాప్తంగా రొమ్ము క్యాన్సర్‌తో పోరాడుతున్న 500 మంది పేద మహిళలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి వారికి పునర్జన్మ ప్రసాదించారు. ఈ సందర్భంగా సోనూసూద్ స్పందిస్తూ.. '500 మంది తల్లులు, సోదరీమణులు కొత్త జీవితాన్ని పొందడం, వారి కుటుంబాల్లో ఆనందం నిండటం నాకు ఎంతో తృప్తినిచ్చింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే, భవిష్యత్తులో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాను' అని తెలిపాడు.

ఇక కరోనా కష్టకాలంలో వేలాది మంది వలస కూలీలను సొంతూళ్లకు పంపడం ద్వారా వెలుగులోకి వచ్చిన సోనూసూద్ సేవా గుణం, ఆ తర్వాత ఏమాత్రం తగ్గలేదు. అప్పటి నుంచి నేటి వరకు వైద్యం, చదువు, ఉపాధి వంటి రంగాల్లో ఎంతో మంది బాధితులకు ఆయన అండగా నిలుస్తూనే ఉన్నారు. సోషల్ మీడియా వేదికగా ఎవరైనా సాయం కోరితే, వెంటనే స్పందించి పరిష్కారం చూపే ఆయన శైలికి యావత్ దేశం ఫిదా అవుతోంది. తాజాగా క్యాన్సర్ బాధితులకు చేసిన ఈ సహాయం పట్ల నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి భరోసా ఇస్తూ, తన ఫౌండేషన్ ద్వారా నిరంతరం కష్టపడే సోనూసూద్ మరియు ఆయనకు సహకరించిన వైద్య బృందానికి ప్రతి ఒక్కరు సెల్యూట్ చేస్తున్నారు.

## మావోయిస్టుల అరెస్టును ఖండించిన తెలంగాణ రాష్ట్ర కమిటీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం రోజు 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్టులపై మావోయిస్టు పార్టీ స్పందిస్తూ.. కీలక లేఖను విడుదల చేసింది. జగన్ పేరుతో విడుదలైన ఈ లేఖలో.. పార్టీ కార్యకర్తల అరెస్టును భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

సిర్పూర్ (యు) మండలంలోని కకర్ బుడ్డి, బాబ్జీ పేట గ్రామాల పరిసరాల్లో నిరాయుధులుగా ఉన్న తమ సహచరులను, గ్రామస్తులతో కలిపి మొత్తం 16 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో వచ్చిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయడానికే ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

కోర్టులో హాజరుపరచాలని డిమాండ్

మంగళవారం పోలీసులు అరెస్టు చేసిన వారందరినీ వెంటనే కోర్టులో హాజరుపరచాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం, విపక్షాలు లేని దేశాన్ని నిర్మించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని లేఖలో విమర్శించారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ఇతర రాజకీయ పార్టీలు ఈ అక్రమ అరెస్టులను ఖండించాలని, తెలంగాణలో శాంతియుత వాతావరణం కొనసాగేలా మద్దతు తెలపాలని పార్టీ విజ్ఞప్తి చేసింది. రాజ్యాంగబద్ధమైన సంస్థలను తమ కంట్రోల్‌లో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

## చెప్పిన చోట ఆగలేదని బస్సు అద్దాలు ధ్వంసం

మొదటి పేజీ తరువాయి

బస్టాప్ లో బస్సు ఆపవా అంటూ దబాయించాడు. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ బస్సు దిగి వెళ్లిపోయాడు. ప్రయాణికులు స్పందిస్తూ నిమిషాల వ్యవధిలోనే బస్సును మూడుసార్లు ఆపారని.. ఇక ఆ కుర్రోడు ఆపమన్న చోట కూడా ఎలా ఆపుతారని అన్నారు. ఈ హఠాత్పరిణామంతో ఖంగుతున్న తిన్న డ్రైవరు, కండక్టర్లు జరిగిన నష్టానికి తలలు పట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు చెబుతున్నారు. అధికారులు తామెలా సమాధానం చెప్పుకోవాలని అనుకుంటూ ఉన్నారు. కుర్రోడు చదువుకుంటున్నట్లుగా వీడియోలో కనిపిస్తోంది. విద్యార్థికి ఇంత ఆవేశం ఉండడం, పబ్లిక్ ప్రాపర్టీ పట్ల బాధ్యత లేకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి.

## ముగిసిన మూడో దశ పంచాయతీ పోలింగ్..




తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మూడో దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్, మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. గడువు ముగిసే సమయానికి క్యూలైన్‌లో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ మూడో దశలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,752 సర్పంచ్ స్థానాలకు, 28,410 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే.. మధ్యాహ్నం 1 గంటల వరకు 80.78% పోలింగ్ నమోదయ్యింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగుతోంది. పోలింగ్ ముగిసిన అనంతరం, మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించనున్నారు. తొలుత వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. వార్డుల లెక్కింపు పూర్తి కాగానే సర్పంచ్ అభ్యర్థుల ఓట్లను లెక్కిస్తారు. సర్పంచ్ ఎన్నిక ఫలితాలను అధికారికంగా ప్రకటించిన వెంటనే, తదుపరి ప్రక్రియగా ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక: సర్పంచ్ ఫలితం తేలిన తర్వాత, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వారి సమక్షంలో ఉప సర్పంచ్ ఎన్నికను పూర్తి చేస్తారు. సాయంత్రానికల్లా మెజారిటీ గ్రామాల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి.

# హెచ్ఎఫ్ నగర్‌లో డంపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలి

### మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలి-సిఐటీయూ డిమాండ్



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎఫ్ నగర్,ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు సిఐటీయూ జూబ్లీహిల్స్ కమిటీ ఆధ్వర్యంలో పర్యటన నిర్వహించారు.ఈ కార్యక్రమం కామ్రేడ్ రాపర్తి అశోక్ నాయకత్వంలో జరిగింది.ఈ సందర్భంగా హెచ్ఎఫ్ నగర్‌లో చెత్త డంపింగ్ పాయింట్ లేకపోవడం వల్ల కార్మికులు చెత్తను ఇందిరానగర్ బస్తీ వరకు తరలించాల్సి వస్తోందని తెలిపారు.దీంతో అదనపు పని భారం పెరిగి,శారీరక శ్రమ తీవ్రంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే హెచ్ఎఫ్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద డంపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని సిఐటీయూ డిమాండ్ చేసింది.బస్తీలు,జనాభా పెరుగుతున్నా మున్సిపల్ కార్మికుల సంఖ్య తగ్గుతోందని,అవసరమైన నియామకాలు చేపట్టకపోవడం వల్ల ఒక్కో కార్మికుడిపై అసాధ్యమైన పని భారం పడుతోందని పేర్కొన్నారు.డమ్మీలను తొలగించి కొత్తగా మున్సిపల్ కార్మికులను నియమించాలని కోరారు.అధిక పని భారం,భద్రతా పరికరాల లోపం కారణంగా మున్సిపల్ కార్మికులు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు.కార్మికుల సగటు జీవితకాలం కూడా తగ్గిపోతుండడం ఆందోళనకరమని పేర్కొన్నారు.ఇది మానవ హక్కుల ఉల్లంఘనగా సిఐటీయూ విమర్శించింది.ధరలు విపరీతంగా పెరుగుతున్న పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులకు సరిపడే వేతనం లేక జీవన భద్రత కోల్పోయారని తెలిపారు.ప్రతి మున్సిపల్ కార్మికుడికి కనీసం నెలకు రూ.26,000 వేతనం అమలు చేయాలని,ఇతర ప్రభుత్వ కార్మికుల మాదిరిగా అన్ని హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు నాగమణి,బాలమణి,పద్మ,నాగేష్,నాగమ్మ తదితరులు పాల్గొని తమ సమస్యలను వెల్లడించారు.

# ఘనంగా ముగిసిన నెల్లికుదురు మండల్ బ్లాక్ లెవెల్ క్రీడలు



తెలుగు గళం న్యూస్ నెల్లికుదురు: మేరా యువ భారత్ వరంగల్ ఆధ్వర్యంలో నెల్లికుదురు మండలంలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ క్రీడలు విజయవంతంగా,ఉత్సాహభరితంగా ముగిశాయి.ఈ క్రీడా పోటీల్లో బాలుర కబడ్డీ విభాగంలో తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు మాట్లాడుతూ..క్రీడలు నిజ జీవితంలో ఎంతో కీలకమైనవని తెలిపారు.మానసికంగా,శారీరకంగా దృఢత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.అలాగే క్రీడల్లో గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే భవిష్యత్తులో విజయవంతంగా ముందడుగు వేయగలమని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కొమురయ్య,మేరా యువ భారత్ జిల్లా యూత్ కోఆర్డినేటర్ ధరావత్ రాజేందర్ నాయక్‌తో పాటు అధ్యాపకులు కుటుంబరావు,సక్రం రాథోడ్ పాల్గొన్నారు.పెద్ద సంఖ్యలో విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొని క్రీడలను ఉత్సాహంగా విజయవంతం చేశారు.



# వరంగల్ జిల్లాలో ఇనుప ఖనిజ నిల్వల అభివృద్ధిపై కేంద్ర నిర్లక్ష్యం

### పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



తెలుగు గళం న్యూస్ న్యూఢిల్లీ డిసెంబర్ 17: వరంగల్ జిల్లాలో భారీగా ఉన్న ఇనుప ఖనిజ నిల్వల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా.కడియం కావ్య ఆరోపించారు.ఈ అంశంపై లోక్‌సభలో ఆమె ప్రశ్నించారు.వరంగల్ జిల్లాలో ఖనిజ సంపదపై స్పష్టత ఇవ్వాలని,గనుల అభివృద్ధి,పర్యావరణ అనుమతులు,స్థానిక సంస్థలకు ఆదాయ భాగస్వామ్యం,గనుల భద్రతా తనిఖీల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎంపీ డా.కడియం కావ్య తీవ్రంగా ప్రశ్నించారు.వరంగల్ జిల్లాలో సుమారు 40 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో అంగీకరించినప్పటికీ,వాటి అభివృద్ధి ఎందుకు ముందుకు సాగడం లేదని ఆమె లేవనెత్తారు.ఈ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ..భారతీయ గనుల బ్యూరో నిర్వహించే జాతీయ ఖనిజ జాబితా (నేషనల్ మినరల్ ఇన్వెంటరీ) ప్రకారం 2025 ఏప్రిల్ 1 నాటికి వరంగల్ జిల్లాలోని ఇనుప ఖనిజ నిల్వలు 'రిమైనింగ్ రిసోర్సెస్' కేటగిరీలో ఉన్నాయని తెలిపారు.అయితే,ఇప్పటివరకు వరంగల్ జిల్లాలో ఒక్క ప్రధాన ఖనిజ గని లీజు కూడా మంజూరు కాలేదని,అలాగే ఒక్క ఖనిజ బ్లాక్ కూడా వేలం వేయలేదని స్పష్టమైంది.దీని వల్ల జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ,ఉపాధి అవకాశాలు,స్థానిక అభివృద్ధి,గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయం వంటి ప్రయోజనాలు ప్రజలకు దక్కని పరిస్థితి కొనసాగుతోందని ఎంపీ విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం గనుల అభివృద్ధిపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని,తెలంగాణ ప్రాంతాల పట్ల వివక్ష చూపుతోందని డా.కడియం కావ్య ఆరోపించారు.వరంగల్ వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని,ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి వినియోగించే దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# నేడు ఖిలా వరంగల్ లో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

### గుడిసె వాసులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

### నళిగంటి రత్నమాల,సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు



తెలుగు గళం న్యూస్ వరంగల్,డిసెంబర్ 17: జక్కలొద్ది గుడిసె వాసులందరికీ వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ,సిపిఎం ఖిలా వరంగల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు శిలా వరంగల్ ఎమ్మార్వో కార్యాలయం ముందు నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నళిగంటి రత్నమాల పిలుపునిచ్చారు.బుధవారం జక్కలొద్ది గుడిసె వాసులతో లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో గుడిసె వాసులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు పొందిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలను పూర్తిగా విస్మరిస్తున్నాయని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే,దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ గుడిసె వాసులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి గెలిచినా,రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఒక్క పట్టా కూడా ఇవ్వలేదన్నారు.అలాగే మంత్రి కడియం కావ్య పార్లమెంటులో పోరాడి పట్టాలు సాధిస్తామని చెప్పినా,నేటి వరకు ఇందిరమ్మ ఇళ్లు గానీ,ఇళ్ల పట్టాలు గానీ అందలేదని ఆరోపించారు.గుడిసె వాసుల న్యాయమైన హక్కుల సాధన కోసం గురువారం ఎమ్మార్వో కార్యాలయం ముందు నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఉసిల్ల కుమార్,టీ.భవాని,సిపిఎం ఏరియా కమిటీ సభ్యులు మైదం వినోద్,రమ్య,లక్ష్మణ్,కోటేశ్వర్,రాకీ ఉపేందర్, అనిత, మంజుల, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

# మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన

### తాడిచెర్ల గ్రామంలో బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికల సందర్భంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ మల్హర్‌రావు మండలం తాడిచెర్ల గ్రామపంచాయతీని సందర్శించి, అక్కడి పోలింగ్ సరళి, బందోబస్తు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు.ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా, పారదర్శకంగా జరిగేలా తీసుకుంటున్న భద్రతా చర్యలపై అధికారులతో ఆయన వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సందర్భంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఓటర్ల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.అలాగే, విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక



బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలితో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆప్యాయంగా మాట్లాడి ఆమె అనుభవాలను తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను గుర్తుచేస్తూ, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.మొత్తానికి, జిల్లా ఎస్పీ స్వయంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించడం వల్ల ఓటర్లలో విశ్వాసం పెరిగిందని,గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా సజావుగా సాగుతున్నాయని అధికారులు తెలిపారు.


# జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఫోటోతో వాట్సాప్‌లో నకిలీ మెసేజ్‌లు

### డబ్బులు పంపాలని కోరుతున్న సైబర్ దుండగులు

### ప్రజలు మోసపోవద్దు-అప్రమత్తంగా ఉండాలి

### -కలెక్టర్ రాహుల్ శర్మ

తెలుగు గళం న్యూస్,భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేరును,హోదాను,ఫోటోను దుర్వినియోగం చేస్తూ వాట్సాప్ ద్వారా డబ్బులు పంపాలని కోరుతున్న నకిలీ సందేశాలు జిల్లాలో పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గట్టి హెచ్చరిక జారీ చేశారు.ఇటీవల కొందరు సైబర్ దుండగులు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఫోటోను వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్‌గా ఉపయోగిస్తూ వివిధ వ్యక్తులకు,ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వ్యాపారులు,ప్రజాప్రతినిధులకు సందేశాలు పంపి 'తక్షణ అవసరం' పేరుతో అత్యవసరంగా డబ్బులు పంపాలని కోరుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు.ఈ సందేశాలు పూర్తిగా నకిలీవని,మోసపూరితమైనవని ఆయన స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ పేరు లేదా హోదాతో వచ్చే ఇటువంటి మెసేజ్‌లను నమ్మి ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు పంపవద్దని,ఎలాంటి ఆన్‌లైన్ లావాదేవీలు చేయవద్దని ప్రజలకు సూచించారు.తన తరపున గానీ,జిల్లా యంత్రాంగం తరపున గానీ వ్యక్తిగతంగా లేదా వాట్సాప్,ఫోన్ కాల్స్ ద్వారా డబ్బులు అడగడం ఎప్పటికీ జరగదని కలెక్టర్ రాహుల్ శర్మ ఖచ్చితంగా తెలిపారు.ఈ తరహా మోసాలు సైబర్ నేరగాళ్ల ప్రభుత్వాధికారుల పేరుతో ప్రజలను భయపెట్టి లేదా విశ్వాసం కలిగించి డబ్బులు దండుకునేందుకు పన్నుతున్న కుట్రలేనని ఆయన పేర్కొన్నారు.ముఖ్యంగా అధికారులతో పరిచయం ఉన్నవారు లేదా ప్రభుత్వ పనులతో సంబంధం ఉన్నవారిని లక్ష్యంగా చేసుకొని ఈ నకిలీ మెసేజ్‌లు పంపుతున్నారని తెలిపారు.ఇలాంటి నకిలీ వాట్సాప్ సందేశాలు అందిన వెంటనే సంబంధిత నంబర్లను బ్లాక్ చేయాలని,అలాగే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




# ఉపాధి హామీ కూలీలను పనికి దూరం చేసే కుట్రలో కేంద్ర ప్రభుత్వం

### -సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య



తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్ డిసెంబర్ 17: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005ను రద్దు చేసి, దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మోడీ 2025' పేరుతో 197వ బిల్లు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రేనని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య ఆరోపించారు.బుధవారం జఫర్‌గడ్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈ బిల్లుతో ఉపాధి హామీ చట్టం చట్టంగా కాకుండా ఒక సాధారణ పథకంగా మారే ప్రమాదం ఉందని,దీని వల్ల లక్షలాది కూలీలు పనికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఉపాధి హామీ పథకానికి అరకొర నిధులు మాత్రమే కేటాయిస్తూ దీన్ని నీరుగారుస్తోందని మండిపడ్డారు.గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు,భూమిలేని కూలీలు,బడుగు-బలహీన వర్గాలకు భరోసాగా నిలిచిన ఈ చట్టాన్ని రద్దు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు.2005లో చట్టంగా రూపొందిన ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు పని హక్కు లభించిందని,అయితే కొత్తగా తీసుకొచ్చిన 197వ బిల్లు ద్వారా ఉన్న ఉపాధినే తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏడాదికి కేవలం 60 పని దినాలకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.ఇప్పటివరకు ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం,రాష్ట్రం 10 శాతం నిధులు అందిస్తుండగా,కొత్త విధానంలో కేంద్రం 60 శాతం,రాష్ట్రాలు 40 శాతం భారం మోయాల్సి వచ్చేలా రూపొందించడం రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారం మోపడమేనని తెలిపారు.నిధుల లేమితో ఈ పథకం పూర్తిగా అచేతనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఉపాధి హామీ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించే కుట్ర జరుగుతోందని,ఇది కూలీల హక్కులను కాలరాస్తుందని అన్నారు.197వ బిల్లును పూర్తిగా రద్దు చేసే వరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/డిసెంబర్ 17: వరంగల్ జిల్లా: వర్ధన్నపేట మండలంలోని, కట్రీయాల గ్రామములో 8 వ,వార్డు సభ్యురాలు ఇటికాల శ్రీలత బావ ఇటికాల బిక్షపతి , సంవత్సరికా కార్యక్రమానికి వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు హాజరై బిక్షపతి చిత్ర పటానికి దండ వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ససంతాపం తెలుపడం జరిగింది.ఈ కార్యక్రమములో గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి సతీష్ గౌడ్, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి చోటే బై, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి అక్బర్,మహిళా మండల నాయకురాలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తీగల సునీత గౌడ్, ఇందిరమ్మ కమిటీ నెంబర్ తాటికాయాల కుమార స్వామి, రెండోవ వార్డు సభ్యులు ఎండి రషీద్ , నాల్గవ వార్డు సభ్యులు చేవ్వల్ల సమత,ఇదోవ వార్డు సభ్యులు కొండ్రతి సునీత, ఏడోవ వార్డు సభ్యులు ఎలికట్టే చిన్న రాజు, పదోవ వార్డు సభ్యులు సుల్తాన్ మాధవి,చెంగల రవి, బైరీ రాజు,బుర్ర రాజు, కొండ్రతి సంతోష్,ఇటికాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గొల్ల బుద్ధారంలో టీఆర్‌పీ ఘన విజయం

**-సర్పంచ్ సుంకరి కిరణ్‌కు భారీ మెజార్టీ**


**గెలుపొందిన సర్పంచ్‌ను ఘనంగా సత్కరించిన జిల్లా అధ్యక్షుడు రవి పటేల్**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూరల్ మండలం గొల్ల బుద్ధారం గ్రామంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) మద్దతుతో పోటీ చేసిన సుంకరి కిరణ్ గ్రామ సర్పంచ్‌గా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ గొల్ల బుద్ధారం గ్రామాన్ని సందర్శించి,నూతనంగా గెలుపొందిన సర్పంచ్ సుంకరి కిరణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ,గొల్ల బుద్ధారం గ్రామం జనరల్ రిజర్వేషన్ స్థానంలో బీసీలు, ఎస్సీలు ఐక్యంగా నిలబడి బీసీ వాదాన్ని ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమైన విషయం అని పేర్కొన్నారు. డబ్బులు, మద్యం లాంటి ప్రలోభాలకు తావివ్వకుండా,క్లీన్ పాలిటిక్స్ ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం గ్రామ ప్రజల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని అన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ స్వచ్ఛమైన రాజకీయాలకు మద్దతు ఇచ్చిన గొల్ల బుద్ధారం గ్రామ ప్రజలకు రవి పటేల్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ విజయం తెలంగాణ రాజ్యాధికార పార్టీ విధానాలపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనమని అన్నారు.భవిష్యత్తులో గొల్ల బుద్ధారం గ్రామ అభివృద్ధికి సర్పంచ్ సుంకరి కిరణ్ నిరంతరం కృషి చేసి, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు కోసం పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీఆర్‌పీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో బీఆర్ఎస్ జెండా ఎగిరింది

**వెయ్యికి పైగా ఓట్ల మెజారిటీతో సర్పంచ్‌గా వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి ఘన విజయం**




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మహాదేవపూర్: మహాదేవపూర్ మండలం కాళేశ్వరం మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఘన విజయాన్ని నమోదు చేసింది. బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి వెయ్యికి పైగా ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థులను చిత్తుగా ఓడించి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ ఫలితం గ్రామ రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది.గ్రామంలోని ప్రతి వార్డు నుంచి బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆధిక్యం లభించడంతో ప్రజలు అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతుగా ఓటు వేసినట్లు స్పష్టమైంది.ముఖ్యంగా గతంలో అమలైన పలు సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకత్వం చూపిన దృష్టి ఈ విజయంలో కీలక పాత్ర పోషించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఇక ఎన్నికల ప్రచారంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, పుష్కరాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజల మద్దతు లభించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారీ హంగులు, ప్రచార ఆర్భాటం ఉన్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థికి కనీసం సగం ఓట్లు కూడా రాకపోవడం గమనార్హం. ప్రజలు ఖర్చు, హడావుడికన్నా నమ్మకమైన నాయకత్వానికే పట్టం కట్టారని ఈ ఫలితం స్పష్టం చేస్తోంది.విజయం సాధించిన అనంతరం వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, “ఈ గెలుపు నాది ఒక్కరిది కాదు. కాళేశ్వరం గ్రామ ప్రజలందరి విజయం. నాపై నమ్మకం ఉంచిన ప్రతి ఓటరికి రుణపడి ఉంటాను. గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చడమే నా లక్ష్యం” అని తెలిపారు.బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున సంబరాలు జరుపుకుంటూ, బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు.ఈ విజయం రాబోయే రాజకీయ సమీకరణాలకు దిశానిర్దేశం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# వెల్లంపల్లి గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

**- సర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డి**

**ఎమ్మెల్యే జీఎస్సార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వెల్లంపల్లి గ్రామ ప్రజాప్రతినిధులు**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి టేకుమట్ల: టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) సహకారంతో నిరంతరం పనిచేస్తానని వెల్లంపల్లి గ్రామ సర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డి స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం, ఈ రోజు భూపాలపల్లి మంజూరునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి ఎమ్మెల్యే జీఎస్సార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో సర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డి మాట్లాడుతూ, వెల్లంపల్లి గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకంతో సర్పంచ్‌గా గెలిపించినందుకు గ్రామస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.ముఖ్యంగా అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం,సైడ్ కాలువల ఏర్పాట్లు, తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ మెరుగుదల వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ,గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు ఐక్యంగా పనిచేస్తే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ ఘటనలో గాయపడిన వ్యక్తిని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్సార్

**బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ**


**- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి శాయంపేట: భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలం మాందారిపేట గ్రామంలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడిన దారంగుల పాణిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) బుధవారం పరామర్శించారు. విద్యుత్ షాక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బాధితుడి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే స్వయంగా అతని ఇంటికి వెళ్లి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితుడితో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.దారంగుల పాణి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన అన్ని విధాల సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున చేయాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.ఇళ్ల మీదుగా వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదానికి కారణమవుతున్నదని గుర్తించిన ఎమ్మెల్యే, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే జీఎస్సార్ స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు.

# ఈ నెల 22న సర్పంచ్,వార్డు సభ్యుల పదవి ప్రమాణ స్వీకారం

**-జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



తెలుగు గళం న్యూస్ జనగామ: ఈ నెల 22వ తేదీన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు,వార్డు సభ్యులుగా ఎన్నికైన అభ్యర్థుల పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం సజావుగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

# గాయపడిన కార్మికుడిని పరామర్శించిన టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్

**కాంట్రాక్టర్ వైఖరిపై ఆగ్రహం - బాధితుడికి పూర్తి వైద్య సహాయం అందించాలని డిమాండ్**




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వంద పడకల దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికుడిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ బుధవారం పరామర్శించారు.కార్లమస్ కాలనీకి చెందిన కన్నివేని సత్యం (మేస్త్రీ) ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా,ఆయన ఆరోగ్య పరిస్థితిని రవి పటేల్ దగ్గరుండి తెలుసుకున్నారు.భూపాలపల్లి ఒకటవ గని ప్రాంగణంలో దుబ్యాల దేవేందర్ రావు కాంట్రాక్టర్ నిర్మిస్తున్న షెడ్లలో మేస్త్రీగా పని చేస్తున్న సమయంలో, కన్నివేని సత్యం ప్రమాదవశాత్తు షెడ్డుపై నుంచి కిందపడి రెండు కాళ్లు విరగడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వంద పడకల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.ఆసుపత్రిని సందర్శించిన రవి పటేల్ వైద్యులను అడిగి చికిత్స వివరాలు తెలుసుకొని,బాధితుడికి మెరుగైన వైద్యం, అవసరమైన శస్త్రచికిత్సలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజువారీ కూలీపై ఆధారపడి జీవించే ఈ కుటుంబానికి ఈ ప్రమాదం తీవ్ర ఆర్థిక భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే ప్రమాదం జరిగి ఏడు రోజులు గడిచినా కూడా సంబంధిత కాంట్రాక్టర్ బాధితుడిని పరామర్శించకపోవడం,కుటుంబానికి అండగా నిలబడకపోవడం అత్యంత దురదృష్టకరమని రవి పటేల్ మండిపడ్డారు.తన వద్ద పని చేసే కార్మికుడికి ఇలాంటి ప్రమాదం జరిగితే, అతడి వైద్య ఖర్చులు భరించడం, అవసరమైన ఆపరేషన్లు చేయించడం, కుటుంబాన్ని ఆదుకోవడం కాంట్రాక్టర్ యొక్క నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.కాబట్టి వెంటనే కన్నివేని సత్యం కుటుంబాన్ని ఆదుకొని, ఆసుపత్రి ఖర్చులు పూర్తిగా భరించి, మెరుగైన వైద్యం అందించాలని కాంట్రాక్టర్‌ను రవి పటేల్ డిమాండ్ చేశారు.కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా కాంట్రాక్టర్లు మానవతా దృక్పథంతో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# చేపలు పట్టేందుకు వెళ్లి వలలో చిక్కుకుని యువకుడు మృతి

**రేగొండలో విషాద ఘటన - ఇద్దరు చిన్నారులకు తండ్రిని కోల్పోయిన కుటుంబం**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనపర్తి గ్రామంలో ఉదయం విషాదకర ఘటన చోటు చేసుకుంది.చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.గ్రామానికి చెందిన మునిగాల రాజు (30)అనే యువకుడు వృత్తిరీత్యా కులవృత్తి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన తండ్రి పేరు నరసయ్య,కులం ముదిరాజు, భార్య మునిగాల అనూష (26), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.ఉదయం తన కులవృత్తిలో భాగంగా చేపలు పట్టేందుకు వెళ్లిన రాజు,చలివాగు ప్రాంతంలో వల వేసే సమయంలో ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నెటిలో మునిగి మృతి చెందినట్లు తెలుస్తోంది.కొంతసేపటికి



స్పందన లేకపోవడంతో స్థానికులు గమనించి సమాచారం అందించగా, అప్పటికే రాజు మృతి చెందినట్లు నిర్ధారణ అయింది.ఈ ఘటనపై మృతుని భార్య మునిగాల అనూష రేగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రేగొండ ఎస్సై కె. రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.యువ వయసులోనే రాజు మృతి చెందడం గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఇద్దరు చిన్నారులతో ఉన్న కుటుంబానికి తండ్రిని కోల్పోవడం హృదయవిదారకమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

# శాయంపేట,దామెర మండలాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన

### హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్




తెలుగు గళం న్యూస్ హనుమకొండ,డిసెంబర్ 17: శాయంపేట,దామెర మండల కేంద్రాల్లో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు.శాయంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి,పోలింగ్ ఏర్పాట్లు,పోలింగ్ సరళి,ఓటింగ్ శాతం తదితర అంశాలపై ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం దామెర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి,అక్కడి పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు.రెండువేలకుపైగా ఓటర్లు ఉన్న పెద్ద గ్రామపంచాయతీల్లో నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేసి కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.మధ్యాహ్నం రెండు గంటల నుండి ప్రారంభమయ్యే కౌంటింగ్ ప్రక్రియను అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.పోలింగ్,కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన పలు సూచనలు అధికారులకు చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను,పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ,మండల ప్రత్యేకాధికారులు జయంతి,బాలరాజు,ఎంపీడీవోలు ఫణిచంద్ర,కల్పన,తహసిల్దార్లు ప్రవీణ్ కుమార్,జ్యోతి వరలక్ష్మి దేవి తదితర అధికారులు పాల్గొన్నారు.



# కొత్తగూడ మండలంలో కాంగ్రెస్ ప్రభంజనం

### 24 గ్రామపంచాయతీల్లో 17 చోట్ల కాంగ్రెస్ విజయం- 6 ఏకగ్రీవాలులి

### బీఆర్ఎస్‌కు ఒక్క గ్రామపంచాయతీకే పరిమితం



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ కొత్తగూడ: మూడవ దశ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 24 గ్రామపంచాయతీలకు గాను 17 గ్రామపంచాయతీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, అందులో 6 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. ఇక బీఆర్ఎస్ పార్టీకి కేవలం ఒక్క గ్రామపంచాయతీ మాత్రమే దక్కడం గమనార్హం.మండల వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడంతో అధికార పార్టీ స్థానాన్ని మరింత బలపరిచింది. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజలకు చేరువైన నాయకత్వమే ఈ విజయానికి కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలిచిన గ్రామపంచాయతీలు (పోటీ ద్వారా): గోవిందాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఇర్ప రణిత,గోపాలపురం గ్రామంలో వట్టం శ్రీనుబాబు,ముస్మి గ్రామంలో బానోతు దేవేందర్,చెరువుముందుతండాలో కుంజ సరిత,పెగడపల్లిలో ఈక సుమలత, గుంజేడులో తోలెం అనంతరావు, గుండం గ్రామంలో గట్టి కొమ్మక్క, ఓటాయిలో గట్టి రాములు, కొత్తపల్లిలో మల్లెల భాగ్యమ్మ, తాటివారివేంపల్లిలో తాటి వసంత, రామన్నగూడెంలో తేజావత్ పార్వతి (దేశ్య),పొగుళ్లపల్లిలో నూనావత్ ఈర్య, ఎదుళ్లపల్లిలో దనుసరి ముత్తయ్య, జంగావని గూడెంలో గొంది సోని%-%రాజు, కొత్తగూడ గ్రామపంచాయతీలో మల్లెల భాగ్యమ్మ,బత్తులపల్లిలో ఈసం పుష్ప %-% సురేందర్,వెలుబెల్లి గ్రామంలో వజ్జ అక్షయ వర్మ కాంగ్రెస్ తరపున సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవంగా కాంగ్రెస్ ఖాతాలో చేరిన గ్రామపంచాయతీలు: కార్లయి గ్రామంలో వెనుక సిరివెన్నెల, కోనాపురంలో కుంజ బిక్షపతి, సాదిరెడ్డిపల్లిలో ఆలూరి కిరణ్, ఎంచగూడలో వాసం నరసమ్మ, మొండ్రాయిగూడెంలో వంక రామయ్య,రేన్య తండాలో మాలోత్ లక్ష్మి - రావోజి నాయక్ ఏకగ్రీవంగా సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ గెలుపు: దుర్గారం గ్రామపంచాయతీలో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు యాకమ్మ సర్పంచ్‌గా ఎన్నికై పార్టీ ఖాతా తెరిచారు. మండల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంబరాలు జరుపుకుంటూ, ప్రజలకు మిఠాయిలు పంచారు. ఈ విజయం ప్రజల ఆశీర్వాదమేనని, రానున్న రోజుల్లో గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తామని నూతన సర్పంచ్‌లు తెలిపారు. ఈ ఫలితాలు జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని మరోసారి చాటుతున్నాయని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.




# జనవరి నుంచి సీఎం చంద్రబాబు ఆకస్మిక పర్యటనలు!



ఏపీ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ప్రజా ఫిర్యాదులకు సంబంధించి 2026 జనవరి నుంచి జిల్లాల్లో ఏప్ సీఎం చంద్రబాబు నాయుడు ఆకస్మిక పర్యటనలు చెయ్యనున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల పైన జిల్లాలో ఆకస్మిక తనిఖీ చేస్తానని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రకటించారు. ఇప్పటికే ఈ ఫైల్స్ క్లియరెన్స్ విషయంలో జనవరి 15ను డెడ్ లైన్‌గా ప్రకటించారు. అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పలు అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

సీఎం చంద్రబాబు జిల్లాల ఆకస్మిక తనిఖీల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అలెర్ట్ అవుతోంది. ఈ ఫైల్ క్లియరెన్స్‌పై ఉన్నతాధికారులు దృష్టి పెట్టనున్నారు. జిల్లా యంత్రాంగం తమ టార్గెట్‌లపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనుంది. 1995లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆకస్మిక తనిఖీలు చర్చనీయాంశం అయ్యాయి. అప్పట్లో కొంతమంది సస్పెండ్ అయ్యారు కూడా. సీఎం చంద్రబాబు 30 ఏళ్ల తర్వాత కూడా ఆకస్మిక తనిఖీలపై దృష్టి పెడుతున్నారు.

# ఇంతకీ హిడ్మా ఎవరు? హైకోర్టు ప్రశ్న!






ఏపీ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): హిడ్మా ఎవరు అని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. హిడ్మా, హిడ్మా భార్య రాజక్క ఎన్కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణ చేయాలని హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలిసిందే. విచారణ సందర్భంగా పిటిషనర్‌ను హిడ్మా ఎవరని హైకోర్టు ప్రశ్నించింది. మావోయిస్టు గ్రూప్ కమాండర్ హిడ్మా అని పిటిషనర్ న్యాయవాది తెలిపారు. హిడ్మా, ఆయన భార్యను ఎన్ కౌంటర్‌కు ముందే అదుపులోకి తీసుకుని మూడు రోజులు టార్చర్ చేశారని పిటిషనర్ కోర్టుకు వివరించారు. ఇది ఫేక్ ఎన్ కౌంటర్ అని దీనిపై జ్యుడిషియల్ విచారణ జరపాలని కోరారు. పిల్ వేయటానికి మీకేం సంబంధం అని న్యాయస్థానం ప్రశ్నించింది.. మెజిస్ట్రేట్ విచారణకు ఆదేశించామని దీనిపై అభ్యంతరాలు ఉంటే సెషన్ కోర్టుకు తెలపాలన్న ప్రభుత్వం చెప్పినట్లు వివరించారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

మరోవైపు.. ఇటీవల మారేడుమిల్లి మండలంలో రెండురోజులపాటు జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో హిడ్మా, టెక్ శంకర్‌తో కలిపి 13మంది మావోయిస్టుల మృతి చెందిన ఘటన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా చర్చగా మారింది.. అయితే, హిడ్మా ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువ్వర్తి గ్రామానికి చెందిన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్ అని మావోయిస్టు కేంద్ర కమిటీ ఆరోపించింది. ఈ మేరకు ఇటీవల ఓ లేఖ విడుదల చేసింది. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వెళ్లిన మావోయిస్టులను పట్టుకొని ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని చెప్పి.. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కాల్చి చంపారని కేంద్ర కమిటీ ఆరోపించింది.

# జగన్‌కు భారీ ఊరట.. సీబీఐ కోర్టు సంచలన తీర్పు





ఏపీ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): వైఎస్ వివేకానందారెడ్డి హత్య కేసు లో కీలక పరిణామం చోటు చేసుకుంది. వివేకానందారెడ్డి, జగన్ కు మధ్య వివాదాలు ఉన్నట్లు ఆధారాలు లేవని సీబీఐ కోర్టుతెలిపింది. వైఎస్ సునీత తరపున కూడా ఆధారాలు సమర్పించలేదని పేర్కొంది. వివేకానందారెడ్డి చనిపోతే బంధువులకు సమాచారం ఇవ్వడం సహజమని చెప్పింది. వివేకా హత్య ఛార్జిషీట్‌లోనూ జగన్ ప్రస్తావన లేదని తెలిపింది. హత్య జరిగిన రోజు ఉదయం జగన్‌కు ఫోన్ కాల్‌పై మరింత దర్యాప్తు అవసరంలేదని చెప్పింది. వివేకా హత్య రోజు కిరణ్ యాదవ్, అర్జున్ రెడ్డి మధ్య జరిగిన మెసేజ్‌లపైనే దర్యాప్తు చేయాలని సీబీఐ కోర్టు ఆర్డర్ వేసింది. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీ ప్రతులు బయటకు రావడంతో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వైఎస్ జగన్‌తో ఉన్న వివాదాల నేపథ్యంలోనే వివేకా హత్య జరిగిందని సునీత తరపున వినిపిస్తున్న వాదనలపై సీబీఐ కోర్టు తీర్పుతో క్లారిటీ వచ్చింది.

# టీటీడీకి తీరని ద్రోహం జరుగుతోంది.. మాజీ చైర్మన్ సంచలన ఆరోపణలు..



ఏపీ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): టీటీడీకి తీరని ద్రోహం చంద్రబాబు చేస్తున్నారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మూడు వెల కోట్ల భూమిని ఒబెరాయ్ హోటల్‌కు ఇచ్చి వేంకటేశ్వర స్వామికే నామాలు పెట్టారని చెప్పారు. పరకామణి దొంగతనం కంటే వందరెట్లు పెద్ద దొంగతనం ఇదన్నారు.. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. వంద రూముల హోటల్ కోసం మూడు వేలకోట్ల విలువైన స్వామి వారి భూములు ఇస్తారా..? అని ప్రశ్నించారు. అలిపిరి రోడ్డులో టూరిజం భూమి తీసుకుని దానిని బదులుగా టీటీడీ భూమి ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఓబరాయ్ హోటల్ కోసం అత్యంత విలువైన భూమిని బదిలీ చేశారు. హోటల్ కు ఆ స్థలం ఇవ్వడమే కాకుండా లీజు కూడా మాఫీ చేశారు. మూడువేల కోట్లు విలువైన భూమిని చంద్రబాబు దోచిపెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు.

రిజిస్ట్రేషన్ చేసినా భూమి ఈసీలో ఇది కనపడటం లేదు.. ఎందుకు దాచారు.. ఎవరి కోసం దాచిపెట్టారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నిలదీశారు. "జీవో ఇవ్వకుండానే.. రిజిస్ట్రేషన్ కాకుండా అక్కడ ఉండే భూమిలోని ఎర్రచందనం చెట్లు మాయం చేశారు. అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా కలెక్టర్ అదేశాలతో ఇవన్నీ జరిగాయి. టీటీడీ భూమి ఎలా ఒబెరాయ్ హోటల్‌కు ఇస్తారు. స్వాములు, పీఠాధిపతులు అందరూ దీన్ని వ్యతిరేకించాలి. దీని వెనుక కోట్లా రూపాయల అవినీతి దాగి ఉంది. పవన్ కల్యాణ్ ఎందుకు దీన్ని అడ్డుకోలేదు.. పవన్, చంద్రబాబు కలసి ప్రైవేటు సంస్థకు ఇచ్చేశారు." అని వెల్లడించారు.

# మాజీ సీఎం జగన్ పై ఏపీ సాధుపరిషత్ ఆగ్రహం




ఏపీ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): తిరుమలపై వైయస్ జగన్ వ్యాఖ్యలు బాధాకరం. అక్కడ ఎటువంటి తప్పు జరిగిన భక్తులు బాధపడతారని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ అన్నారు. పరకామణి చోరీని జగన్ చిన్న కేసుగా అనడంపై సాధుపరిషత్ తరపున ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జగన్ పరాకమణి వ్యవహారం చేసిన వ్యాఖ్యలను స్వామిజీ ఖండించారు. పార్టీ తరపున ఎటువంటి వివరణ రాకపోవడాన్ని తప్పుబట్టారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వైసీపీ వ్యవహరించడం సరికాదన్నారు. వైసీపీ నేతలకు హిందువులంటే హీనంగా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. వెంకటేశ్వర స్వామి అంటే అంత దీనంగా భావిస్తురా అని అసహనం వ్యక్తం చేశారు.

ఎన్నికలొస్తే హిందువులు విడిపోయి ఓట్లేస్తారని పగటి కలలు కంటున్నారా అని ప్రశ్నించారు. హిందువుల్లో చైతన్యం వచ్చిందని.. ప్రతి హిందువు కూడా వైసీపీ చేస్తున్న దురాగతాలను గమనిస్తున్నారని అన్నారు. గతంలో తప్పుల మీద తప్పులు చేశారు కాబట్టే వైసీపీని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. అయినా కూడా వైసీపీ నేతలకు బుద్ధి రావడం లేదని, పశ్చాత్తాపం కలగడం లేదని అన్నారు. వెంకటేశ్వర స్వామినే కించపరిచి మాట్లాడేంత అహం భావమా అని నిలదీశారు. వెంకటేశ్వర స్వామి గురించి మాట్లాడుతుంటే ఎంత జాగ్రత్తగా మాట్లాడాలి.. కానీ వెటకారంగా మాట్లాడడం ఏమిటని అన్నారు. దేవుడి కంటే మనం గొప్పవారమా అని అడిగారు. ప్రధానులు కూడా స్వామివారి ముందు సాకిల పడుతున్నారన్నారు.

చర్చికి, మసీదుకు తమను ఆహ్వానిస్తే వినమ్రులై వెళ్తామన్నారు. తాము ఇతర మతస్తుల మనోభావాలను గౌరవిస్తామన్నారు. అన్ని మతాలను తాము ప్రేమిస్తామన్నారు. కానీ వైసీపీ నేతలో ఆ సమభావన కనిపించడం లేదన్నారు. హిందువుల మీద, హిందూ ఆచారాల మీద, దేవాలయాలపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారని శ్రీనివాసానంద ఆరోపించారు. తప్పును సరిదిద్దుకోవాల్సిన బాధ్యత వైసీపీ నేతలపై ఉందన్నారు. వెంకటేశ్వర స్వామి వారి దివ్యమూర్తి నల్లరాయితో పోల్చిన భూమన కరుణాకర రెడ్డికి టీటీడీ చైర్మన్ పదవిని వైసీపీ ఇచ్చిందని గుర్తు చేశారు. హిందువులకు వైసీపీ నేతలు చేసిన మేలు ఏంటో చెప్పాలన్నారు.

ఒక్క పూజారికైనా కనీసం ఐదు వేల రూపాయలు ఇచ్చారా అని వైయస్ జగన్ ను అడిగారు. కూటమి ప్రభుత్వం ధూప, దీప, నైవేద్యం పథక మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచారన్నారు. ఏ రోజు వైసీపీ నేతలు హిందువుల పక్షాన నిలిచారో చెప్పాలన్నారు. వైవీ సుబ్బారెడ్డిని, కరుణాకర రెడ్డిని విచారణకు పిలవగానే భయం మొదలైందన్నారు. ఏవీఎస్ఓ సతీష్ కుమార్ అనుమానాస్పద మరణంపై అనుమానాలను వ్యక్తం చేశారు. త్వరలోనే బండారం బయటపడుతుందన్నారు. ఇంత జరుగుతుంటే పరకామణి చోరీ చిన్న విషయం అంటారా అని నిలదీశారు.

## క్యాన్సర్ రోగులకు గుడ్‌న్యూస్..వ్యాధిని తగ్గించే చికిత్సను కనుగొన్న శాస్త్రవేత్తలు!



హెల్త్ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం): క్యాన్సర్ రోగులకు శుభవార్త అందింది. త్వరలో క్యాన్సర్‌ను తగ్గించే చికిత్స రాబోతోంది! ఎలుకలపై చేసిన ఒక అధ్యయనంలో క్యాన్సర్ వల్ల శరీరంలో ఉండే కార్టికోస్టెరోన్ అనే హార్మోన్ లయ (రిథమ్) దెబ్బతింటుందని, ఆ లయను మళ్లీ సరిచేస్తే క్యాన్సర్ కణితులు గణనీయంగా చిన్నవయ్యాయని పరిశోధకులు గుర్తించారు. ఈ ఫలితాలు ప్రస్తుతం ఉన్న క్యాన్సర్ చికిత్సలు మరింత ప్రభావవంతంగా పనిచేయడానికి సహాయపడవచ్చని వారు భావిస్తున్నారు. శరీరంలోని బయోలాజికల్ క్లాక్‌ను (సర్కేడియన్ క్లాక్) లక్ష్యంగా చేసుకుని, మందులు సరైన సమయానికి ఇవ్వడం ద్వారా క్యాన్సర్‌ను తగ్గించవచ్చని ఇప్పటికే కొన్ని అధ్యయనాలు సూచించాయి. దీనినే 'క్రోనోథెరపీ' అంటారు. తాజా పరిశోధనకు నాయకత్వం వహించిన జెరెమీ బోర్నిగర్ మాట్లాడుతూ.. తాము ఎలుకలకు నేరుగా క్యాన్సర్ మందులు ఇవ్వలేదని చెప్పారు. “రోగి శరీరంగా ఎంత ఆరోగ్యంగా ఉంటే, అదే క్యాన్సర్‌తో పోరాడుతుంది. ఇలా శరీర లయను సరిచేయడం వల్ల భవిష్యత్తులో చికిత్సల ప్రభావం పెరిగి, వాటి దుష్ప్రభావాలు కూడా తగ్గవచ్చు” అని ఆయన అన్నారు.

మన శరీరంలో హైపోథాలమస్, పిట్యూటరీ గ్రంథి, అడ్రినల్ గ్రంథులు కలిసి పనిచేసే ఒక వ్యవస్థ ఉంటుంది. దీన్ని హెచ్‌పీఏ అక్షం అంటారు. ఇది మన శరీరంలో రోజు–రాత్రి లయ సక్రమంగా ఉండేలా చేస్తుంది. కానీ బ్రెస్ట్ క్యాన్సర్ కలిగిన ఎలుకల్లో కార్టికోస్టెరోన్ అనే స్ట్రెస్ హార్మోన్ లయ తీవ్రంగా దెబ్బతింటున్నట్లు పరిశోధకులు గమనించారు. సాధారణంగా ఈ హార్మోన్ స్థాయిలు రోజంతా పెరుగుతూ తగ్గుతూ ఉంటాయి. కణితులు బయటకు కనిపించేలోపే, కేవలం మూడు రోజుల్లోనే ఈ హార్మోన్ లయలో 40 నుంచి 50 శాతం వరకు తగ్గుదల కనిపించిందని బోర్నిగర్ తెలిపారు. ఎలుకల మెదడులోని హైపోథాలమస్‌ను పరిశీలించగా, ముఖ్యమైన న్యూరాన్లు చాలా యాక్టివ్‌గా ఉన్నప్పటికీ సరైన అవుట్‌పుట్ ఇవ్వని స్థితిలో ఉన్నట్టు తెలిసింది. ఆ న్యూరాన్లను మళ్లీ సహజమైన రోజు%-%రాత్రి చక్రంలా పనిచేసేలా ఉత్తేజితం చేయగా, స్ట్రెస్ హార్మోన్ లయ మళ్లీ సాధారణ స్థితికి వచ్చింది. దాంతో క్యాన్సర్‌ను ఎదుర్కొనే ఇమ్యూన్ కణాలు కణితులలోకి ఎక్కువగా చేరి, ట్యూమర్లు గణనీయంగా చిన్నవయ్యాయి. సరైన సమయానికి ఈ ఉత్తేజన ఇవ్వడం వల్లే ఈ ఫలితం వచ్చిందని పరిశోధకులు తెలిపారు. తప్పు సమయానికి ఇస్తే ఇలాంటి ప్రభావం కనిపించలేదని కూడా చెప్పారు. పరిశోధకుల మాటల్లో, సరైన సమయంలో శరీర లయను పునరుద్ధరించడం ఇమ్యూన్ వ్యవస్థకు క్యాన్సర్ కణాలను చంపే శక్తిని పెంచుతుంది. ఇది ఎలా జరుగుతుందో పూర్తిగా అర్థం చేసుకునేందుకు ఇంకా పరిశోధన అవసరమని చెప్పారు.

## రోజూ టీ తాగడం వల్ల బరువు పెరుగుతున్నారా.. అయితే ఇది మీకోసమే..



హెల్త్ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం): చలికాలంలో చాలామంది శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడానికి ఉదయాన్నే టీ తాగుతుంటారు. అయితే, ప్రతిరోజూ టీ తాగడం వల్ల బొడ్డు కొవ్వు పెరుగుతుందా? బరువు పెరుగుతుందా? అనే సందేహం చాలామందిని వెంటాడుతుంది. ఈ భయంతో కొందరు చలికాలంలో టీ తాగడాన్ని పూర్తిగా మానేయాలని కూడా ఆలోచిస్తుంటారు.

అయితే, ఛాయ్‌ను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ సలీం జైదీ తెలిపారు. సరైన విధానంలో, సరైన పదార్థాలతో టీని తీసుకుంటే అది హానికరంగా కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. చలికాలంలో టీ శరీరాన్ని లోపల నుంచి వెచ్చగా ఉంచడమే కాకుండా జీవక్రియలను సక్రియంగా ఉంచడంలో సహాయపడుతుందని చెప్పారు. అంతేకాదు, శరీర బరువు నియంత్రణకు, రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యంగా ఉంచేందుకు కూడా టీ ఉపకరిస్తుందని పేర్కొన్నారు.

బరువు తగ్గడం, ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం కోసం చాలామంది టీలో అల్లం, దాల్చిన చెక్క, నల్ల మిరియాలు, సెలెరీ వంటి పదార్థాలను కలుపుతారు. ఇవన్నీ శరీరానికి వేడిని అందించే గుణం కలిగి ఉండటంతో చలికాలంలో ప్రత్యేకంగా ఉపయోగపడతాయి. ఈ సహజ పదార్థాలు జలుబు, దగ్గు వంటి సమస్యలను నివారించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మెటబాలిజాన్ని పెంచడంలో సహాయపడతాయి.

అల్లం, దాల్చిన చెక్క లేదా నల్ల మిరియాలతో తయారైన టీ శరీరాన్ని లోపల నుంచి వేడి చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచి, కొవ్వు కరుగుదలకు కూడా తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు. అందువల్ల టీని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని, అయితే టీలో అధికంగా చక్కెర లేదా పాలు కలపకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా మితంగా టీ తాగడం చాలా అవసరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ సమాచారం అంతా ఇంటర్నెట్ నుంచి గ్రహించాం. కావున మీరు ఈ టిప్స్ ఫాలో అయ్యే ముందు న్యూట్రిషియన్ ని కలవడం మంచింది.

# కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్నాయా..? అయితే ఈ విత్తనాలను తీసుకోండి..!

హెల్త్ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం): గుండె జబ్బుల బారిన పడడానికి కారణమైన అంశాలలో అధిక కొలెస్ట్రాల్ కూడా ఒకటి. నూనెలో వేయించిన పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం, శారీరక శ్రమ చేయకపోవడం, ధూమపానం, మద్యపానం వంటి వివిధ కారణాల వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా పేరుకుపోతూ ఉంటుంది. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బులతో పాటు శరీర బరువు కూడా పెరుగుతుంది. ఇతరత్రా అనారోగ్య సమస్యల బారిన కూడా పడాల్సి వస్తుంది. నేటి తరుణంలో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్య బారిన పడుతున్నారు. అయితే జీవన విధానంలో మార్పుతో పాటు మన ఆహారంలో కొన్ని రకాల గింజలను తీసుకోవడం వల్ల ఈ సమస్య నుండి చాలా సులభంగా బయట పడవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. అధిక కొలెస్ట్రాల్ ను తగ్గించే గింజల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

అవిసె గింజలు..

అధిక కొలెస్ట్రాల్ తో బాధపడే వారు అవిసె గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అవిసె గింజల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లతోపాటు లిగ్నన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి అధిక కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఎంతగానో సహాయపడతాయి. అలాగే గుమ్మడి గింజలు కూడా అధిక కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో దోహదపడతాయి. వీటిలో మెగ్నీషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉండదంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. ఇక అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారు పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఫైటోస్టెరాల్స్ తో పాటు మంచి కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.



నువ్వులు..

అలాగే కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో నువ్వులు కూడా మనకు ఎంతో ఉపయోగపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా తయారవ్వడంతో పాటు కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో చియా విత్తనాలు కూడా దోహదపడతాయి. వీటిలో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్ ను తొలగించడంలో మనకు సహాయపడుతుంది. అలాగే అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారు మెంతులను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఫైబర్ తో పాటు సపోనిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే అవయవాల నుండి కొలెస్ట్రాల్ ను తొలగించడంలో దోహదపడతాయి.

కాలోంజి విత్తనాలు..

కాలోంజి విత్తనాలు కూడా అధిక కొలెస్ట్రాల్ సమస్య నుండి బయటపడడంలో తోడ్పడతాయి. వీటిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు అధికంగా ఉంటాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉండే జనపనార విత్తనాలను తీసుకోవడం వల్ల కూడా కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

# మెస్సికి అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చిన అనంత్ అంబానీ.. ఎన్నికోట్లంటే..?



స్పోర్ట్స్ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం): తన గోట్ ఇండియా టూర్ లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి.. గుజరాత్‌లోని జామ్‌నగర్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ స్థాపించిన వన్యప్రాణుల సంరక్షణ, పునరావాసం, పరిరక్షణ కేంద్రం అయిన వంతారా ను విజిట్ చేశారు. అక్కడ జంతువులతో మెస్సి సరదాగా సమయాన్ని గడిపారు. వంతారాను విజిట్ చేసిన మెస్సికి అనంత్ అంబానీ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. తన గుర్తుగా రిచర్డ్ మిల్లె వాచ్‌ని ఫుట్‌బాల్ స్టార్‌కు బహుమతిగా ఇచ్చారు.

పలు నివేదికల ప్రకారం.. వంతారా సందర్శనకు వెళ్లేటప్పుడు మెస్సి చేతికి ఎలాంటి వాచ్ లేదు. అనంత్‌తో మీటింగ్ తర్వాత అతడి చేతిపై ఓ అరుదైన, అత్యంత ఖరీదైన గడియారం దర్శనమిచ్చింది. ఆ వాచ్ రిచర్డ్ మిల్లె RM 003-V2 GMT టూర్‌బిల్లాన్ ఆసియా ఎడిషన్. ఇలాంటివి ప్రపంచంలో కేవలం 12 పీస్‌లు మాత్రమే ఉంటాయి. దీని ధర దాదాపు 1.2 మిలియన్ డాలర్లుగా నివేదికలు పేర్కొంటున్నాయి. అంటే మన భారత కరెన్సీలో దాదాపు రూ. 10.91 కోట్లు అన్నమాట. ఈ గడియారాన్ని అనంత్ అంబానీ మెస్సికి బహుమతిగా ఇచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇక అనంత్ అంబానీ సైతం ఇలాంటి మరోవాచ్‌ను ధరించడం విశేషం. రిచర్డ్ మిల్లె RM 056 సఫైర్ టూర్‌బిల్లాన్ అనంత్ చేతికి కనిపించింది. దీని విలువ దాదాపు దాదాపు 5 మిలియన్ డాలర్లుగా తెలుస్తోంది. అంటే రూ.45.59 కోట్లన్నమాట. ప్రస్తుతం ఈ న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

# మినీ వేలం తర్వాత మరింత పటిష్టంగా ఆరెంజ్ ఆర్మీ లైనప్

స్పోర్ట్స్ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం): దుబాయ్ వేదికగా మంగళవారం మధ్యాహ్నం 2. 30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఐపీఎల్ మినీ వేలం జరిగింది. ఈ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. జట్టుకు అవసరం అయిన స్థానాల్లో నెదర్లాండ్స్ ఆల్ రౌండర్ బాస్ డి లీడేను 2.2 కోట్లకు దక్కించుకోవడం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ గా నిలిచింది. ఇప్పటికే హెన్రిచ్ క్లాసెన్, పాట్ కమిన్స్, అభిషేక్ శర్మ వంటి కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ఎస్‌ఆర్‌హెచ్.. తాజా కొనుగోళ్లతో మిడిల్ ఆర్డర్, బౌలింగ్ విభాగాలను మరింత పటిష్టం చేసుకుంది.

వజ్రాయుధం లాంటి బ్యాటింగ్.. ధీటైన బౌలింగ్ విభాగం

ప్రస్తుత జట్టును పరిశీలిస్తే, ట్రావిస్ హెడ్ మరియు అభిషేక్ శర్మల ఓపెనింగ్ జోడీ ప్రత్యర్థులకు వణుకు పుట్టించడం ఖాయం. మిడిల్ ఆర్డర్‌లో నితీష్ కుమార్ రెడ్డి, క్లాసెన్‌లకు తోడుగా భారీ హిట్టర్ లివింగ్ స్టోన్ అనుభవం జట్టుకు ఉపయోగపడనుంది. బౌలింగ్ విభాగంలో కెప్టెన్ పాట్ కమిన్స్‌తో పాటు హర్షల్ పటేల్, శివమ్ మావి, ఉనద్కత్ ఉన్నారు. ఇలా అన్ని విభాగాల్లో సన్ రైజర్స్ జట్టు మరింత బలంగా మారింది. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్యాన్స్ ఈ సారి తమ జట్టు సెమీస్ రేసులో కచ్చితంగా ఉంటుందని, ముఖ్యంగా ఐపీఎల్ లో 300 స్కోరును కొట్టి తీరుతుందని నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.




# విరాట్ కోహ్లీకి బిగ్ షాక్.. ఆ ప్లేయర్ అన్ సోల్డ్ !



స్పోర్ట్స్ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం): ఐపీఎల్ 2026 మినీ వేలం నిన్న జరిగిన సంగతి తెలిసిందే. అబుదాబి వేదికగా జరిగిన ఈ ఈవెంట్ లో చాలామంది ప్లేయర్లపై కోట్ల వర్షం కురిసింది. అయితే మరికొంతమంది ప్లేయర్లకు మాత్రం ఊహించని ఎదురుదెబ్బే తగిలింది. చాలామంది ప్లేయర్లు అన్ సోల్డ్ అయ్యారు. ఈ లిస్టులో విరాట్ కోహ్లీ జట్టుకు చెందిన స్వస్తిక్ చికారా కూడా ఉన్నాడు. 2025 ఐపీఎల్ టోర్నమెంట్ విజేతగా ఆర్సీబీ నిలిచిన సంగతి తెలిసిందే.

అయితే ఈ టోర్నమెంట్ ఫైనల్ లో బెంగళూరు గెలిచిన తర్వాత విరాట్ కోహ్లీ చాలా ఎమోషనల్ అయ్యాడు. ఆ సందర్భంగా విరాట్ కోహ్లీతో పాటు స్వస్తిక్ చికారా అనే ఆటగాడు సందడి చేసిన సంగతి తెలిసిందే. కోహ్లీతో పాటు కనిపించడంతో స్వస్తిక్ చికారా క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. సోషల్ మీడియాలో అతని ఫాలోవర్స్ సంఖ్య కూడా అమాంతం పెరిగిపోయింది. అయితే, ఈ స్వస్తిక్ చికారాకు నిన్న జరిగిన వేలంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అతన్ని ఏ జట్టు కూడా కొనుగోలు చేయలేదు. దీంతో మినీ వేలంలో అన్ సోల్డ్ ప్లేయర్ గా మిగిలిపోయాడు స్వస్తిక్ చికారా.

# సీఎస్కే అభిమానులకు షాక్.. ఎంఎస్ ధోని రిటైర్మెంట్..



స్పోర్ట్స్ న్యూస్, 17 డిసెంబర్ (తెలుగు గళం): టీమిండియా మాజీ కెప్టెన్, సీఎస్కే ఆటగాడు ఎంఎస్ ధోనీ భవిష్యత్తుపై భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప కీలక వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్ 2026 సీజన్ ధోనీకి చివరి సీజన్ అవుతుందని తెలిపారు. 44 ఏళ్ల ధోనీ ఈ సీజన్ ముగిసిన తర్వాత ఆటకు వీడ్కోలు పలికి, జట్టులో మెంటర్ పాత్రలో కొనసాగేందుకు సిద్ధమవుతున్నారని చెప్పుకొచ్చాడు. కాగా, ఇటీవలి కాలంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో భారీ మార్పులు చేసింది. అనుభవజ్ఞులైన ఆటగాళ్లను కాదని, యువ, అన్ క్యాప్డ్ ప్లేయర్స్ పై ఎక్కువగా దృష్టి పెట్టింది. గత సీజన్ చివర్లో డెవాల్డ్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే, ఉర్విల్ పటేల్ వంటి యువ ఆటగాళ్లు అద్భుతంగా ఆడటమే దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు.

అయితే, అబుదాబీలో జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో సీఎస్కే తన వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్‌ను, వికెట్‌కీపర్- బ్యాటర్ కార్తీక్ శర్మను రూ.14.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ ఇద్దరూ ఐపీఎల్ వేలం చరిత్రలోనే అత్యంత ఖరీదైన అన్‌క్యాప్‌డ్ దేశీయ ఆటగాళ్లుగా రికార్డు సృష్టించారు. మొత్తం రూ.41 కోట్లతో తొమ్మిది మంది ప్లేయర్స్ ను కొనుగోలు చేసిన సీఎస్కే , అందులో రూ.28.4 కోట్లను కేవలం ఈ ఇద్దరు యువ ఆటగాళ్లకే ఖర్చు చేయడం గమనార్హం.

ఇక, ఎంఎస్ ధోనీ ఇప్పటికీ లోయర్ ఆర్డర్లో బ్యాటింగ్ చేస్తూ.. వికెట్‌కీపర్‌గా జట్టుకు సేవలందిస్తున్నారు. గత సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో మధ్యలోనే మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు కూడా చేపట్టారు. అయితే, జట్టులో యువ ఆటగాళ్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం చూస్తే, ధోనీ ఆటగాడిగా కాకుండా మెంటర్‌గా మారే దిశగా అడుగులు వేస్తున్నారని జియో హాట్‌స్టార్‌తో మాట్లాడిన రాబిన్ ఉతప్ప పేర్కొన్నారు. ఇక సందేహాలకు చోటు లేదు.. ఇదే ధోనీ చివరి ఐపీఎల్ సీజన్.. ఈ సీజన్‌తో ఆయన పూర్తిగా ఆటకు వీడ్కోలు పలకనున్నారని వెల్లడించారు. యువ ఆటగాళ్లపై సీఎస్కే దృష్టి పెట్టిందని, గత ఏడాది నుంచి జట్టు తీసుకున్న నిర్ణయాలను చూస్తుంటే అర్థమవుతుందని తెలిపాడు.

కాగా, మినీ వేలానికి ముందు రవీంద్ర జడేజాను రాజస్థాన్ రాయల్స్‌కు ట్రేడ్ చేసి, సర్ఫరాజ్ ఖాన్, రాహుల్ చాహర్ వంటి ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవడం కూడా ఇదే వ్యూహానికి నిదర్శనమని రాబిన్ ఉతప్ప పేర్కొన్నారు. ధోనీ లాంటి మెంటర్ ఉంటే మరో జడేజాను తయారు చేయడం అసాధ్యం కాదు.. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీతో పాటు ధోనీ మార్గదర్శకత్వం ఉంటే, సీఎస్కే సరైన దిశలో ముందుకు వెళ్తుందన్నారు. ధోనీ ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత కూడా సీఎస్కే తో అనుబంధం కొనసాగిస్తారనే విషయంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ సీజన్‌లో ధోనీ మెంటర్-కమ్-ప్లేయర్ పాత్రలో కనించనున్నారు. ఇప్పటికే ఆయన ఆ దృష్టితోనే ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది.. గత ఐదు సీజన్లుగా ధోనీ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు కొనసాగుతున్నప్పటికీ, అభిమానులకు సరైన వీడ్కోలు ఇవ్వాలనే ఉద్దేశంతో ఆయన ఇంకా కొనసాగుతున్నారని మాజీ క్రికెటర్ ఉతప్ప వెల్లడించారు.

# సినిమా న్యూస్

## మళ్ళీ డైరెక్షన్ చేయబోతున్న హీరో!



'కోమాలి' చిత్రంతో దర్శకుడిగా పరిచయమై తొలి సినిమాతోనే సత్తా చాటిన ప్రదీప్ రంగనాథన్, ఆ తర్వాత 'లవ్ టుడే'తో హీరోగా మారి సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. వరుసగా 'డ్రాగన్', 'డ్యూడ్' వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద బ్యాక్ టు బ్యాక్ బ్లాక్‌బస్టర్లు అందుకున్న ప్రదీప్.. ఇప్పటివరకు అపజయం అనేదే తెలియని క్రేజీ స్టార్‌గా ఎదిగారు. ప్రస్తుతం నయనతార భర్త విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ఆయన నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ప్రదీప్ తన తదుపరి చిత్రం కోసం మళ్ళీ మెగాఫోన్ పట్టబోతున్నట్లు తెలుస్తోంది. హీరోగా నటిస్తూనే స్వయంగా దర్శకత్వం వహించబోతున్న ఈ ప్రాజెక్ట్ గురించి వినిపిస్తున్న అప్‌డేట్స్ ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ కొత్త చిత్రంలో ప్రదీప్ రంగనాథన్ ఒక ఆసక్తికరమైన సైన్స్ ఫిక్షన్ కథను తెరకెక్కించనున్నట్లు సమాచారం. 'లవ్ టుడే'లో యూత్‌ఫుల్ ఎమోషన్స్‌ను అద్భుతంగా పండించిన ప్రదీప్, ఈసారి సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో తన మార్క్ టేకింగ్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి. హీరోగా తనకంటూ ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను సంపాదించుకున్న తరుణంలో, మళ్ళీ స్వీయ దర్శకత్వంలో వస్తుండటంతో ఇది ప్రేక్షకులకు ఖచ్చితంగా డబుల్ ట్రీట్ కానుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన మరియు మరిన్ని వివరాలు కొద్ది రోజుల్లోనే వెలువడే అవకాశం ఉంది.

## తాత కాబోతున్న కింగ్ నాగార్జున?



టాలీవుడ్ కింగ్ నాగార్జున త్వరలోనే తాతగా ప్రమోషన్ పొందబోతున్నారనే వార్త గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారమవుతోంది. మొదట నాగచైతన్య-శోభిత దంపతుల గురించి రూమర్స్ రాగా, తాజాగా అఖిల్-జైనబ్‌లు తల్లిదండ్రులు కాబోతున్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై తాజాగా ఒక హెల్త్ ఈవెంట్‌లో నాగార్జున స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."మీరు తాత గా ప్రమోట్ అవుతున్నారట కదా.. నిజమేనా?" అని మీడియా అడగగా.. ఆయన,నవ్వుతూ 'సరైన సమయం వచ్చినప్పుడు నేనే చెప్తాను' అంటూ దాటవేశారు. ఈ వార్తలను ఆయన ఖండించకపోవడంతో, అక్కినేని ఇంట్లో త్వరలోనే వారసుడు లేదా వారసురాలు అడుగుపెట్టబోతున్నారనేది నిజమేనని నెటిజన్లు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. అంతే కాదు అదే వేదికపై నాగార్జున తన ఆరోగ్యానికి సంబంధించిన ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు.. తాను గత 15 ఏళ్లుగా తీవ్రమైన మోకాలి నొప్పితో బాధ పడుతున్నట్లు ఆయన వెల్లడించారు. సర్జరీ చేయించుకోవడం ఇష్టం లేక, లూబ్రికెంట్ ఫ్లూయిడ్స్ మరియు పీఆర్‌పీ చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు.. 'నొప్పి ఉన్నా లేకపోయినా ప్రతిరోజు ఉదయం క్రమం తప్పకుండా మోకాలి కోసం వ్యాయామం చేస్తాను.. అది అస్సలు మిస్ అవ్వదు' అని తన ఫిట్‌నెస్ రహస్యాన్ని బయటపెట్టారు. 60 ప్లస్‌లో కూడా కుర్ర హీరోలకు పోటీ ఇచ్చేలా కనిపించే నాగార్జున, ఇలాంటి హెల్త్ ప్రాబ్లమ్స్ ఉన్నా తన క్రమశిక్షణతో వాటిని జయిస్తున్న తీరుకు అభిమానులు ఫిదా అవుతున్నారు.

## ఎట్టకేలకు 'విశ్వంభర' రిలీజ్ పై లేటెస్ట్ అప్డేట్ !




మెగాస్టార్ చిరంజీవి హీరోగా, వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న అడ్వెంచర్ మూవీ "విశ్వంభర" కోసం మెగాభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. 'భోళా శంకర్' వంటి నిరాశపరిచిన ఫలితం తర్వాత చిరు చేస్తున్న చిత్రం కావడం, పైగా 'జగదేకవీరుడు అతిలోకసుందరి' రేంజ్ ఫాంటసీ ఎలిమెంట్స్ ఉండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం ఎక్కువ సమయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం,

అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్ అప్‌డేట్ అతి త్వరలోనే రాబోతున్నట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది వేసవి కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ ఇది వరకే స్పష్టం చేశారు. అయితే సమ్మర్ రేసులో ఖచ్చితంగా ఏ రోజున సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుందో ఇప్పుడు స్పష్టత ఇవ్వబోతున్నారు. మరోవైపు, చిరంజీవి నటిస్తున్న మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం కూడా లైన్‌ల్లో ఉండటంతో, ఈ రెండింటిలో ఏది ముందు వస్తుంది? అనే ఉత్కంఠ నెలకొంది. 'విశ్వంభర' ను దృష్టిలో పెట్టుకుని మేకర్స్ దీనిని సోలో రిలీజ్ డేట్ కోసం ప్లాన్ చేస్తున్నారట. అంటే దీని బట్టి ఈ మూవీ కోసం ఎదురుచూస్తున్న మెగా ఫ్యాన్స్‌కు త్వరలోనే చిత్ర యూనిట్ అదిరిపోయే కిక్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఎట్టకేలకు అతడిని పెళ్లి చేసుకోబోతున్న రష్మి..?



బుల్లితెర యాంకర్ రష్మి గౌతమ్ జబర్దస్త్ షో ద్వారా ఫుల్ ఫేమ్ సంపాదించుకుంది. ఆమె లైఫ్‌కి ఈ షో టర్నింగ్ పాయింట్ అయింది. గుర్తింపు రావడంతో పాటు, భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను కూడా రాబట్టుకుంది. అంతేకాకుండా సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండి.. తన హాట్ ఫోటోలతో మరింత క్రేజ్‌ను దక్కించుకుంది. ఇక ఈ షో చేస్తున్న సమయంలోనే.. కమెడియన్ సుడిగాలి సుధీర్‌తో కలిసి పలు ఈవెంట్లు, షోలు చేయడంతో వీరిద్దరు ప్రేమలో ఉన్నారని పలు పుకార్లు వచ్చాయి. ఈ జంట కెమిస్ట్రీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడంతో నిజ జీవితంలో కూడా ప్రేమలో ఉన్నారని అంతా చర్చించుకున్నారు. కానీ అనూహ్యంగా గత రెండేళ్లుగా రష్మి, సుధీర్ ఎక్కడా కలిసి కనిపించడం లేదు. సుడిగాలి సుధీర్ జబర్దస్త్ షోను విడిచి వెళ్లి హీరోగా సినిమాలు చేస్తున్నారు. ఇక రష్మి విషయానికొస్తే.. జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి షోలతో బిజీ అయిపోయింది. ఇక లేటెస్ట్ ఎపిసోడ్‌కి సంబంధించిన ప్రోమో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఇందులో భాగంగా రష్మి గుడ్ న్యూస్ చెప్పింది. ఇందులో ఓ ఆస్ట్రాలజర్ వచ్చి రష్మి జాతకం గురించి ఆసక్తికర విషయాలు చెప్పాడు. వచ్చే ఏడాది ఆగస్టు నెలలో రష్మి పెళ్లి చేసుకుంటుందని.. అది కూడా మనసులో ఉన్న వ్యక్తితోనే వివాహం జరగనుందని చెప్పాడు. ఇక ఈ వ్యాఖ్యలపై స్పందించిన రష్మి.. ఆస్ట్రాలజర్ చెప్పిన విషయాల్లో నిజం ఉందని చెప్పడంతో అంతా ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు కంగ్రాట్స్ చెబుతున్నారు. అలాగే యాంకర్ రష్మి మనసులో ఉన్న వ్యక్తి ఎవరు? సుడిగాలి సుధీరేనా లేదా మరెవరైనా ఉన్నారా? అని పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.